ఆలయాలను దర్శించుకున్న సీనియర్ సివిల్ జడ్జి

నవతెలంగాణ-రామారెడ్డి


జిల్లా జడ్జికి సన్మానం

మండలంలోని మద్దికుంట లో వెలసిన శ్రీ స్వయంభూ బుగ్గ రామలింగేశ్వర స్వామి, ఇస్సన్నపల్లి(రామారెడ్డి)లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయాలను ఆదివారం కామారెడ్డి సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల వృద్ధాశ్రమాన్ని, అన్నదాన సత్రాన్ని, గోశాలను పరిశీలించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆలయం ఉందని అన్నారు. పూజారి దంపతులు ఆమెను శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలతో పాటు స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోజారి లచ్చిరెడ్డి, పూజారి గనే స్వామి, ఒరగంటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

తండా అభివృద్ధికి కృషి చేయండి

ఎమ్మెల్యే మదన్ మోహన్ రావును కలిసిన సర్పంచ్

నవతెలంగాణ-లింగంపేట్


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచ్ దంపతులు

నిధులు కేటాయించి తమ తండా అభివృద్ధికి కృషి చేయాలని పర్మళ్ల మలావత్‌తండా సర్పంచ్ సునీత ప్రకాశ్ కోరారు. ఆదివారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. తండాలో నెలకొన్నటువంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రధాన సమస్యలు పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఎలా ముందుకెళ్దాం..

- బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నాయకులతో సమావేశం

నవతెలంగాణ-కామారెడ్డి డెస్క్


హాజరైన పార్లమెంట్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు

లోక్ సభ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ప్రతినిధులతో సమావేశం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. శాసనసభ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలు, లోక్ సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలతో, మాజీ ఎమ్మెల్యేలతో ముఖ్య నాయకులకుతో, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి కులంకషంగా చర్చించారురు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ స్పీకర్‌లు పోచారం శ్రీనివాస్ రెడ్డి, మధుసూధనా చారి, ఎంపీ బిబి పాటిల్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావు, మాజీ శాసనసభ్యులు గంప గోవర్ధన్ (కామారెడ్డి), జాజుల సురేందర్ (ఎల్లారెడ్డి), హన్మంత్ షిండే (జుక్కల్), క్రాంతి కిరణ్, (ఆందోల్), యం భూపాల్ రెడ్డి (నారాయణ ఖేడ్) నిజామాబాద్, కామారెడ్డి జడ్పీ చైర్మన్‌లు, డీసీసీబీ చైర్మన్ మరియు జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల ముఖ్య ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

యాసంగి సాగుకు నీటికటకట

- తగ్గుతున్న వరి విస్తీర్ణం
- ప్రాజెక్టుల్లో, చెరువులో నీటి లభ్యత అంతంతే..
- భూగర్భ జలాలపై అనుమానం

నవతెలంగాణ-లింగంపేట్


పర్మళ్లలో నీరు అందకపోవడంతో నాట్ల దశలోనే ఎండుముఖం పడుతున్న వరి

యాసంగిలో వరి సాగు విస్తీర్ణం తగ్గుతుంది. చెరువులో నీటి లభ్యత తక్కువగా ఉండటం, భూగర్భ జలాలు సైతం అంతంగా ఉండటంతో చేతికొచ్చే సమయంలో నీరు లేకపోతే అప్పటి వరకు చేసిన కష్టం వృథాగా పోతోందని భావిస్తున్న పలువురు రైతులు.. సాగు విస్తీర్ణం తగ్గించుకుంటున్నారు. ప్రతిసారి ఐదు ఎకరాల్లో సాగు చేసే వారు ఈ సారి 2 నుంచి 3 ఎకరాలకు పరిమితమవుతున్నారు. దీంతో క్రమంగా సాగువిస్తీర్ణం తగ్గేట్టు కనిపిస్తుందని వ్యవసాయశాఖ అధికారులు సైతం అంచనా వేస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో 3 లక్షల 18 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తారని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో ముఖ్యంగా వరి పంట ఒక లక్ష 80 వేల 797 ఎకరాల్లో వరి పంట సాగు అవుతుందని అధికారుల అంచనా వేశారు. అదేవిధంగా మొక్కజొన్న 29,158 జొన్న 17,776 ఎకరాలు, చెరుకు 2994 ఎకరాలు, గోధుమ 2810 ఎకరాలు, సెనగ 1414 ఎకరాలు, కుసుమ 1692 ఎకరాలు, తెల్ల కుసుమ 880, నువ్వులు 1110 ఎకరాలు, ఇతర పంటలు ఏడు వేలెకరాలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. ముఖ్యంగా భారీ మొక్కజొన్న సెనగ పంట సాగు అధికంగా సాగుతుందని అధికారులు అంచన వేసిన రైతులు మాత్రం ఆరుతడి పంటలపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ఒక లక్ష 80 వేల 797 ఎకరాలలో వరి పంట సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు సుమారు 50 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయినట్టు నివేదిక రూపొందించారు. నాట్లు ఇప్పుడిప్పుడే ముమ్మరం అవుతుండ టంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉన్నా.. గతేడాదికంటే తగ్గే అవకాశాలున్నట్టు భావిస్తున్నారు.

నీటి కటకట

ముఖ్యంగా జిల్లాలో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలైన పోచారం, నిజాంసాగర్, కౌలాస్, సింగీతం ప్రాజెక్టు ప్రాంతాల్లో మాత్రమే రైతులు వరి పంటలు సాగు చేస్తున్నారు. ఎల్లారెడ్డి, నిజాంసాగర్ బాన్సువాడ నస్రుల్లాబాద్ బీర్కూరు మండలాల్లోనే వరి పంటలు వరి పంటలు సాగు చేస్తున్నారు. ఇప్పటికే ముందస్తుగా వరి నాట్లు వేశారు. పోచారం ప్రాజెక్టు నీటిపై ఆధారపడి నాగిరెడ్డిపేట్ ఎల్లారెడ్డి మండలలో చెందిన కొంతమంది రైతులు వరి నాట్లు వేశారు. గురువారం పోచారం ప్రాజెక్ట్ నీటిని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్‌మోహన్‌రావు ఇరిగేషన్ అధికారులు ప్రజా ప్రతినిధులు రైతుల సమక్షంలో నీరుని విడుదల చేశారు.

లింగంపేట్ రామారెడ్డి రాజంపేట మాచారెడ్డి మండలాల్లో వరి పంటలు సాగు చేయడానికి రైతులు ముందుకు రాకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

లింగంపేట్ మండలంలోని ఖరీఫ్ సీజన్లో 25 వేల ఎకరాలలో చెరువు కుంటల వద్ద బోరుబావుల, పెద్దవాగు నీటిపై ఆధారపడి వరి పంటల సాగు చేసే రైతులు యాసంగిలో 15 వేల ఎకరాలు వరి పంట సాగు చేశారు. ఈ లెక్కన పదివేల ఎకరాలు విస్తీర్ణం తగ్గింది. పెద్దవాగు పరిసర ప్రాంతాలైన రైతులు లిఫ్ట్ ద్వారా వరి పంటలు సాగు చేసుకునేవారు పెద్దవాగులో నీరు రోజురోజుకు తగ్గుముఖం పట్టడంతో పెట్టుబడి పెట్టిన ఫలితం లేకుండా పోతుందనే ఉద్దేశంతో అప్పుల పాలు కావలసి వస్తుందని రైతులు సాగుకు ముందుకు రావడం లేదు.

అనుకున్నంత కురవని వర్షాలు

ఖరీఫ్ సీజన్లో భారీ వర్షాలు కురిసినా ఆ తర్వాత ఆశించిన స్థాయి వర్షాలు కురవకపోవడంతో చెరుకుంటలో నీరు తగ్గుముఖం పట్టింది. భూగర్భ జలాలు అడుగంటి పోయే అవకాశాలు ఉన్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో బోరుబావులు ఎత్తిపోయే ప్రమాదం ఉందని భావిస్తున్నట్టు పలువురు రైతులు వరి పంట వేసేందుకు ముందుకు రావడం లేదు.

గత సంవత్సరం యాసంగిలో రెండు లక్షల పదిహేను వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఈ సంవత్సరం ఒక లక్ష 80 వేల ఎకరాలు సాగు చేయడం లక్ష్యాన్ని అధికమించలేకపోతున్నారు. యాసంగి పై ఆశలు పెట్టుకున్న రైతులకు నిరాశ మొదలైంది.

నీళ్లు లేక నాటేయ్యలే

పోచగౌడ్. రైతు. పర్మళ్ల



యాసంగిలో పెద్ద వాగులో నీళ్లు లేకపోవడంతో పెద్దవాగు సమీపంలో మూడు ఎకరాల పొలంలో వరి నాటయ్యలేదు. గత సంవత్సరం పెద్దవాగులో యాసంగి సాగుకు సరిపడా నీళ్లు ఉండే. ఈ సంవత్సరం నీళ్లు లేకపోవడంతో నాటు వేయలేదు. అదేవిధంగా పరమళ్ళ చెరువు సమీపంలో మూడెకరాలు ఉన్న చెరువులో నీళ్లు తక్కువగా ఉండడంతో పెట్టుబడులు మీద పడతాయని వరి నాటు వేయలేదు.

బోరులో నీళ్లు తగ్గడంతో రెండెకరాల్లోనే సాగు

మేఘ్యా నాయక్. శెట్టిపల్లి తండా



వ్యవసాయ బోర్లు నీళ్ల తగ్గడంతో నాలుగు ఎకరాలు భూమి ఉన్న రెండెకరాలే వరి నాటేశామన్నారు బోర్లు రోజు రోజుకు నీళ్ల తగ్గిపోతున్నాయ ఆయన అన్నారు నాలుగు ఎకరాలు వేస్తే చివరికి ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు అందుకే ముందస్తు జాగ్రత్తగా రెండు ఎకరాలు వేశాను అన్నారు

పనుల్లో అవకతవకలు

- చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలోని పెద్దతడగూర్ గ్రామపంచాయతీ పనుల్లో లోపాలు జరిగినట్లు అలాంటి వాటి పట్ల చర్యలు చేపట్టాలని గ్రామ అభివృద్ధికి ప్రత్యేకంగా చొరవ చూపాలని ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండ రాజు, ఈరన్న, యువ నాయకులు కోరారు. ఆదివారం హైదరాబాదులో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామ అభివృద్ధిలో లోపాలు జరిగాయని, పెండింగ్ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వాటి పట్ల చర్యలు తీసుకోవాలని కోరారు.

భర్తను హత్య చేయించిన భార్య

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఘాతుకం
- హత్య కేసు ఛేదించిన పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్ రూరల్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

నిజామాబాద్ దక్షిణ మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో మల్లారం గండిలో గుర్తుతెలియని వ్యక్తి మర్డర్‌కేసు పోలీసులు ఛేదించారు. వివాహేతర బంధానికి అడ్డుగా ఉన్న భర్తను.. భార్యే హత్య చేయించినట్టు పోలీసులు తెలిపారు. ఆదివారం ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ కిరణ్‌కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఇంద్రపూర్ ప్రాంతానికి చెందిన సయ్యజీ(35)- అశ్విని ఇరువురు దంపతులు. సయ్యాజి తాగి వచ్చి కొడుతుంటాడని సమాచారం. అయితే అశ్విని రామ్ జింజోర్‌తో వివాహేతర సంబంధం కొనసాగిస్తు న్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తాగిచ్చి కొడుతుడటంతో పాటు వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడనే పక్కా పథకం ప్రకారం భార్య అశ్విని, వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న యువకుడు మరి కొందరి సహాయంతో నిజామాబాద్ శివారులోని మల్లారం సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి మద్యం సేవించారు. మత్తులోకి జారుకోగా కత్తితో గొంతు కోసి భర్తను అతి దారుణంగా హత్య చేయించినట్టు సమాచారం. ఈ ఘటన మిట్ట మధ్యాహ్నం జరగగా శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో వెలుగులోకి వచ్చింది.. విషయం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేయగా మృతుడి కుడి చేతిపై తన కూతురు పేరు గాయత్రి అని పచ్చబొట్టుతో ఉన్నట్లు రూరల్ పోలీసులు గుర్తించారు. అయితే మల్లారం సమీపంలోని అటవీ ప్రాంతం లో పేకాట, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతాయని అనేది బహిరంగ రహస్యమే. ఈ కేసులో పూర్తిగా భర్తను చంపడానికి పక్కాగా భార్య ప్లాన్ చేసినట్టు పోలీసులు తెలిపారు. 48 గంటల్లోనే కేసును ఛేదించి ప్రధానంగా భార్యను అలాగే వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకోవడంపై ఉన్నతాధి కారులు నిజామాబాద్ సౌత్ రూరల్ సిఐ వెంకటరమణ, రూరల్ ఎస్సై మహేష్ తో పాటు సిబ్బందిని నిజామాబాద్ పోలీస్ శాఖ అభినందించింది.

12న ఛలో ఢిల్లీని విజయవంతం చేయాలి

- ఎస్ఎఫ్ఐ పిలుపు


ఫండ్ క్యాంపెయిన్ చేపట్టిన ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 12న జరిగే ఛలోఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గల నెహ్రూ పార్కు వద్ద గల దుకాణ సముదాయాలలో ఛలోఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాస్ ఫండ్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి పోషమైన మహేష్ మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ ఇతర విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 12న జరిగే ఛలోఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థులలో అశాస్త్రీయ విధానాలను పెంపొందించే విధంగా ఉన్న నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని, యూనివర్సిటీలలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా పకడ్బందీ చట్టాలు రూపొందించాలని అన్నారు. అలాగే మహిళా రక్షణ కోసం కఠిన చట్టాలను రూపొందించి అమలు చేసే రకంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు విశాల్, ఉపాధ్యక్షులు దీపిక, గణేష్, సందీప్, నాయకులు బాబురావు, వరదరాజ్, సజన్ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

గాలిపటాలతో జాగ్రత్త..!



- ప్రమాదంగా మారుతున్న సరదా
- పతంగి ఎగురేస్తూ ప్రమాదాల బారిన పడుతున్న కొందరు..
- రోడ్డుపై వెళ్తున్న వాహనదారులకు ప్రాణసంకటంగా మారుతున్న మాంజా
- విచ్చలవిడిగా చైనా మాంజాల విక్రయాలు
- పోలీసులు తనిఖీలు చేయాలంటున్న బాధితులు

నవతెలంగాణ-భిక్కనూర్

సంక్రాంతి పండుగ సందర్భంగా చిన్నారులు, పెద్దలు సరదాగా గాలిపటాలను ఎగరవేసి ఆనందించాల్సిన సమయంలో గాలిపటాల కారణంగా కొందరికి తీవ్ర గాయాలు అవుతుంటే మరికొందరికి ప్రాణాలు పోతున్నాయి. మార్కెట్లో విక్రయించే చైనా, ప్లాస్టిక్ మాంజాలు కారణంగా ద్విచక్ర వాహనాలపై, నడుచుకుంటూ వెళ్తున్న వారికి మెడ, చెవి, చేతులు తెగిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు.

కామారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు, దోమకొండ, భిక్కనూర్, రాజంపేట, మాచారెడ్డి ఆయా మండలాలలో విచ్చలవిడిగా చైనా మాంజాలను విక్రయిస్తున్నారు. ఈ చైనా మాంజాలు ప్రభుత్వం విక్రయించరాదని ఆదేశాలు ఉన్న గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారస్తులు పెద్ద మొత్తంలో డంపు చేసుకొని విక్రయిస్తున్నారు. ఎక్కడ దొరకని కారణంగా యువకులు 500 నుండి 1000 రూపాయల వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

సంక్రాంతి పండుగ వస్తున్న సమయంలో వ్యాపారస్తులపై పోలీసులు నిఘా పెట్టి చైనా మాంజాలను విక్రయించకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటివరకు చైనా మాంజాలపై తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. పండుగ సందర్భంగా వ్యాపారస్తులు పోలీసులు తనిఖీలు చేయడం లేదని విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. వాహనాలపై వెళ్తున్న సమయంలో హెల్మెట్ ధరించాలని ప్రచారం చేసే పోలీసులు చైనా మాంజల కారణంగా ప్రాణాలు పోతున్నా ఎందుకు పట్టించుకోవడంలేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు.


పతంగి మాంజా తో కోసుకుపోయిన చెవి

భిక్కనూరు పట్టణంలో తిప్పాపూర్ గ్రామానికి చెందిన అరవింద్, సాయి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై పనుల నిమిత్తం పట్టణ కేంద్రం నుండి రామాయంపేట వైపు వెళ్తున్న సమయంలో సిద్ధ రామేశ్వర ఆలయ కమాన్ వద్ద చైనా మాంజ కారణంగా యువకులకు మెడ, చెవి, చెంప, చేతి వేలు తెగిపోయి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి గాయాలైన యువకులను ఆస్పత్రికి తరలించారు.

సంక్రాంతి పండుగ గాలిపటాల సరదా కాస్త ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం అవుతున్న సమయంలో పోలీసులు స్పందించి పగడ్బందీగా తనిఖీలు చేసి చైనా మాంజాలను విక్రయిస్తున్న వారిపై, చైనా మాంజల ద్వారా గాలిపటాలను ఎగురవేస్తున్న యువకులపై చర్యలు తీసుకోవాలని, ప్రతి గ్రామంలో చైనా మాంజాల ద్వారా గాలిపటాలను ఎగురవేస్తే జరిగే ప్రమాదాలు పై ప్రజలకు వివరించాలని, గాలిపటాలను ఎగురవేస్తున్న వ్యక్తుల వద్ద ఉన్న మాంజాలను తనిఖీలు చేయాలని బాధితులు, ప్రజలు కోరుతున్నారు.


చెంపపై మాంజా కాటు

చైనా మాంజాల వినియోగిస్తే చర్యలు తప్పవు

ఎస్ఐ సాయికుమార్

చైనా మాంజలను వ్యాపారస్తులు విక్రయించిన, గాలిపటాలను ఎగురవేసిన వారిపై చర్యలు తప్పవని ఎస్సై సాయి కుమార్ హెచ్చరించారు. చైనా మాంజాలను ప్రభుత్వం నిషేధించిందని విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని సూచించారు.

తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలి

బాధితుడు అరవింద్

చైనా మాంజా కారణంగా చెవి, వేలు తెగిపోయింది. కనిపించకుండా గాలిపటాలను ఎగురవేస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

13 జిల్లాల స్పౌజ్ బదిలీలు చేపట్టండి

- ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డికి, భూపతిరెడ్డికి వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్


కుటుంబీకులతో కలిసి ఎమ్మెల్యేను కలిసిన టీచర్‌లు

గత ప్రభుత్వం తీసుకొచ్చిన అశాస్త్రీయ విధానాల వల్ల ఉద్యోగస్తులైన భార్య, భర్తలు వివిధ జిల్లాలకు విసిరివేయ బడ్డారని, మెమో నెంబర్ 1655 ప్రకారం భార్యాభర్తలు ఒకే జిల్లాలో పనిచేయాల్సి ఉన్నా 19 జిల్లాలో స్పౌజ్ బదిలీలు జరిపి 13 జిల్లాలను బ్లాక్లో ఉంచారని, స్పౌజ్ బదిలీలు చేపట్టాలని మహిళా ఉపాధ్యాయులు కోరారు. బోధన్, రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డికి, భూపతిరెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ 13 జిల్లాలలో భర్త ఒక జిల్లాలో, భార్య మరోజిల్లాలో, పిల్లలు ఒకదగ్గర, వృద్ధులైన తల్లిదండ్రులు ఇంకొక దగ్గర, దీని మూలంగా కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమైనట్టు తెలిపారు. రెండు సంవత్సరాల నుంచి ధర్నాలు, ర్యాలీలు పిల్లలతో సహా రోడ్డెక్కిన కూడా గత ప్రభుత్వం కనికరించలేదని అన్నారు. రోజు వందల కిలోమీటర్ల ప్రయాణాలు చేయలేక, కుటుంబాలను విడిచి పనిచేసే చోట ఉండలేక, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. 2023 జనవరిలో అప్పటి ప్రభుత్వం కేవలం 615 స్పౌజ్ బదిలీలను మాత్రమే జరిపిందని ఇంకా 1500 స్పౌజ్ బదిలీలు పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమై నంత తొందరగా స్పౌజ్ బదిలీలు జరిపించాలని బాధితులు వేడుకున్నారు. కార్యక్రమంలో స్రవంతి, అనూష, నరేష్, అభిమన్యు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి రెండవ పంథా కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్

పద్మశాలి (రెండోవ పంథా) నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ నూతన అధ్యక్షులుగా బ్రహ్మదండి చిన్నయ్య, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, సెక్రటరీగా దాసరి నరేష్, జాయింట్ సెక్రటరీగా చిల్క నర్సయ్య క్యాషియర్‌గా జోగు త్రిమూర్తి, కమిటీ సభ్యులుగా హరిన్, ఆనంద్, పోశెట్టి, పెంటు గంగాధర్, సహాదారులుగా దాసరి నర్సింగ్ దాస్, బ్రహ్మదండి లింగం, జోగు నర్సయ్యను ఎన్నుకున్నట్టు జిల్లా కార్యదర్శి దయానంద్ వెల్లడించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా కార్యదర్శి గురుడు దయానంద్, టెంటు రమేష్, రవి, కృష్ణహరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వివా క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ అరవింద్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్‌లో జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ కార్యాలయంలో విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫర్ అసోసియేషన్(వివా) వారి 2024 సంవత్సర క్యాలెండర్ ను ఆదివారం ఎంపీ ధర్మపురి అరవింద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివా జిల్లా అధ్యక్షులు రాఘవాపురం గోపాలకృష్ణ చార్య మాట్లాడుతూ విశ్వకర్మ ఉద్యోగులు చేస్తున్న సేవ కార్యక్రమాలను వివరించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొడాపల్లి రాజారాం ఆచార్య, గౌరవ అధ్యక్షులు ముత్తన్న, డివిజన్ అధ్యక్షులు గంగాధర్, సత్యనారాయణ, నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సునీల్‌రెడ్డి పరామర్శ



నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యులు జోగు సంగీత-నర్సయ్య దంపతుల కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ సభ్యులైన జోగు సంగీత-నర్సయ్యల చిన్నమ్మ జోగు భూదేవి ఇటీవల కాలంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సునీల్ కుమార్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి, పార్టీ సీనియర్ కార్యకర్తలు చిన్నారెడ్డి, ముస్కు ముత్తెన్న, బద్దం సాగర్ రెడ్డి, రవి రెడ్డి, సాజిత్, పోల ప్రవీణ్, అబ్రార్, లోక సుభాష్, ఏలేటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు 8నుండి దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ

లిమహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాలలో 6, 7,8 వ తరగతిలో 2024-25 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశానికి ఈనెల8 నుండి ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని టిజిపిఏ నిజామాబాద్ అధ్యక్షులు నక్క రాజేందర్ ఆదివారం తెలిపారు. నాలుగవ తరగతి విద్యార్థులు 5. వ తరగతి ప్రవేశానికి చివరి తేదీ ఈనెల 20 వరకు పొడిగించినట్టు పేర్కొన్నారు.

టీడీపీ నిజామాబాద్ పట్టణ కన్వీనర్‌గా అంబిక సత్యనారాయణ



పట్టణ కన్వీనర్‌గా ఎంపికైన అబిక సత్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

టీడీపీ నిజామాబాద్ పట్టణ కన్వీనర్‌గా అంబిక సత్యనారాయణ ఎన్నికయ్యారు. కో కన్వీనర్‌గా కోయేడి నర్సింలు, బండారి కల్లెడ గంగాధర్, టిడిపి పార్టీ కార్యాలయంలో నూతన కమిటీని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అందులోనూ టిడిపి పట్టణ బీసీ సెల్ కన్వీనర్‌గా లవంగ రాజు, ఎస్సీ సెల్ కన్వీనర్‌గా అశోక్ అర్సపల్లి, కో కన్వీనర్‌గా శ్రావణ్, బిజినెస్ సెల్ నవాతే నర్సయ్య, టియన్‌టియుసి కన్వీనర్‌గా గంగ సాగర్, తెలుగు యువత రమేష్ గౌడ్, కో కన్వీనర్‌గా చెరుకు గంగాధర్, తెలుగు రైతు కన్వీనర్‌గా సల్ల సత్య నారాయణ, కో కన్వీనర్‌గా గంగోనే రాజేశ్వర్, తెలుగు మహిళ కన్వీనర్‌గా లక్ష్మి యాదవ్, మైనార్టీ సెల్ కన్వీనర్‌గా సలీం భాయ్, కో కన్వీనర్‌గా సర్వారాజ్, విద్యార్థి విభాగం కన్వీనర్ వెంకటేష్, చేనేత విభాగం కన్వీనర్‌గా రవికుమార్ పాటిల్, సాంస్కృతిక విభాగం కటికే గణేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ జనరల్ సెక్రెటరీ రెంజార్ల సురేష్, అర్బన్ సీనియర్ నాయకులు ఎండీ రఫిక్ ఖాన్, రాజేశ్వర్ గుప్త, హరీష్, మల్లరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న సంఘం నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల గ్రామంలోని పెద్దమ్మ తల్లి ముదిరాజ్ సంఘం, యాదవ సంఘం భవనాల ప్రహరి గోడ నిర్మాణానికి రూ.8లక్షలతో మండలం ఉపాధ్యక్షులు యోగేష్ ఆదివారం భూమి పూజ చేశారు . పార్లమెంట్ సభ్యులు ఎంపీ అరవింద్ నిధులను మంజూరు చేయడానికి సహకరించారని, గ్రామం తరపున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు నీల గ్రామానికి రూ.కోటి 23లక్షలు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మారా నాగభూషణం, యాదవ సంఘం ముదిరాజ్ సంఘం పెద్దలు, జి.సాయిలు, నేరడి గంగాధర్, లక్ష్మణ్, భూమన్న, రాములు, అల్లం పోశెట్టి, కొమ్ము శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన న్యాయవాదులు



వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

నవతెలంగాణ-ఆర్మూర్

హైకోర్టు న్యాయమూర్తి , భవన నిర్మాణ కమిటీ సభ్యుడు జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి , జిల్లా ఫోర్ట్ ఫోలియో జడ్జ్ యన్. తుకారాంజీ పట్టణ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షు లు సరసం చిన్నారెడ్డి మాట్లాడుతూ.. పట్టణ న్యాయస్థానంలో అదనపు భవ నం అదనపు జిల్లా జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నియమించాలని వినతి పత్రం అందజేశారు. కార్య క్రమంలో సీనియర్ న్యాయవాదులు భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం, రెండవ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయండి

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రికి వినతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



వైద్య ఆరోగ్యశాఖమంత్రికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఏఏన్‌ఎంలు

తెలంగాణలో రెండవ ఏఎన్ఎంగా పని చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలంటూ మండలానికి విచ్చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం సమర్పించినట్టు రెండో ఏఎన్ఎంలు ఆదివారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంపిహెచ్ఎ(ఎఫ్) రాతపరీక్ష లేకుండా రెగ్యులర్ చేయుట గురించి వినతి పత్రం సమర్పించినట్లు రెండవ ఏఎన్ఎంలు తెలిపారు. 2014 సంవత్సరానికి ముందు నియమించిన రెండవ ఏఎన్ఎం స్వరాష్ట్ర ఆకాంక్షతో అలుపెరుగని పోరాటంతో నీళ్ళు, నిధులు, నియామకాలకోసం తెతెలంగాణ ఆత్మగౌరవం కొరకు సాధించుకున్న స్వరాష్ట్రంలో తీవ్ర నిర్లక్ష్యానికి, అవమానాలకు గురయ్యామని అన్నారు. రాష్ట్రంలో దాదాపు 6వేల మంది వెట్టిచాకిరీ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో అనేక పర్యాయాలు సమస్యలను గురించి విన్నవించుకునే ప్రయత్నం చేసినా అరణ్యరోధనే అయ్యిందని వాపోయారు. 16 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నామని, ఆరోగ్య ఉప కేంద్రంలో పనిచేసి రెగ్యులర్ ఎంపి హెచ్ఎ(ఎఫ్) సమానంగా పనిచేస్తున్నా జీతాల్లో మాత్రం వ్యత్యాసం ఉందన్నారు. ఎంపిహెచ్ఎ(ఎఫ్) పోస్టులు ఖాళీగా ఉన్న ఉప కేంద్రాలలో అన్ని పనులను 2వ ఎఎన్ఎం అయిన తాము చేస్తున్నామని తెలిపారు. తమకు ఆరోగ్య భద్రత, కనీస వేతనము లేదని అన్నారు. ఉద్యోగం రెగ్యులర్ అవుతుందనే ఆశతో ఇన్నాళ్ళుగా పనిచేస్తున్నామని , తమ నియామకం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అయిందని, ఉద్యోగం పర్మినెంట్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అవుతుందని ఆశిస్తున్నామని తెలిపారు. మంత్రి స్పందిస్తూ యూనియన్ నాయకులను కలవమనండి.. మీ ఉద్యోగాల రెగ్యులర్ గురించి మాట్లాడుతామని తెలిపారని చెప్పారు.

కళావిహీనంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం

నవతెలంగాణ-బోధన్

ప్రజల సౌకర్యార్థం ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గ కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని నిర్మించింది. అంత వరకు బాగానే ఉన్న ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే అటువైపు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దాంతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నేడు ఆదరణ కోల్పోయి కళావిహీనంగా మారింది. కార్యాలయ ఆవరణలో ఈదురు గాలులకు పడిపోయి అస్తవ్యస్తంగా ఉన్నా వాటిని తొలగించే వారు లేరు. చెత్త, చెదారం, పచ్చిక బయళ్లతో ఉన్న లాన్ ప్రస్తుతం ఎండిపోయి కళావిహీనంగా తయారయింది. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని పట్టించుకుని ప్రజల సౌకర్యార్థం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



పేద ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లో వచ్చా

- అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాదు నగర శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ అర్బన్ శాసనసభ్యులు గా ఎన్నికైందుకు హైదరాబాద్‌లోని చందానగర్ శ్రీ తెలంగాణ వాసవి ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. రాజకీయాల్లోకి వచ్చింది సమాజ సేవ చేయడానికి వాసవి మాత బిడ్డగా ప్రజలకు నిత్యం సేవ చేస్తూ అందరి మన్ననలు పొందుతానని అన్నారు. కేంద్రంలో మోదీ ఓబీసీ రిజర్వేషన్ ద్వారా ఎంతో మంది ఆర్యవైశులకు లాభం చేకూరిందని అన్నారు. అర్బన్‌లో భారీ మెజార్టీ తో గెలిపించిన ప్రజలకు చిరస్థాయిగా గుర్తుండేలా అభివృధి పనులు చేస్తానని తెలిపారు. ట్రస్ట్ ద్వారా అనేక సేవ కార్యక్రమాలు చేస్తూ ఎల్లప్పుడూ ప్రజల మధ్యలో ఒక సైనికుడిగా పనిచేస్తున్నాని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వాసవి ఐక్యవేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

జోస్ ఆలుక్కాస్ సామాజిక సేవలు అభినందనీయం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

బంగారు వజ్ర ఆభరణాల వ్యాపారంలో ముందంజలో ఉన్న జోస్ ఆలుక్కాస్ జ్యువెలరీ షోరూం సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ కొనియాడారు. జోస్ ఆలుక్కాస్ జువెలరీ షోరూం ప్రథమ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే, నగర మేయర్ దండు నీతూ కిరణ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జోస్ ఆలుక్కాస్ ఫౌండేషన్ సిఎస్ఆర్ నిధులు సుమారు రూ. 2,41,338 వెచ్చించి కొనుగోలు చేసిన స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సామాగ్రి చెక్కును జడ్పిపిఎస్ బొమ్మన్ దేవుపల్లి పాఠశాల ప్రతినిధులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ దండు నీతూ కిరణ్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. మహా నగరాలకు పరిమితమైన ఆభరణాల వ్యాపారం ప్రస్తుతం జిల్లా కేంద్రాలకు విస్తరించాయన్నారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా షోరూం ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే రూ.30లక్షల వ్యయంతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగుల తరలింపుకు అవసరమయ్యే ఏసి బస్సును బహుకరించడన్ని వారి సామాజిక బాధ్యతను గుర్తు చేశారని అన్నారు. ఆసుపత్రికి అందజేసిన బస్సు రోగుల తరలింపుకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలలో ముందుండాలని సంస్థ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ స్మితీష్ మాట్లాడుతూ.. వినియోగదారుల ఆదరాభిమానాలు చురగొని మొదటి వార్షికోత్సవం సందర్భంగా ప్రతి రూ. 50 వేల బంగారు ఆభరణాల కొనుగోలుపై ఒక గోల్డ్ కాయిన్ ఉచితం అని, ప్రతి కొనుగోలుపై ఉచిత బహుమతి, వజ్రాభరణాలపై 20శాతం, ప్లాటినం ఆభరణాలపై 7శాతం ప్రత్యేక తగ్గింపు సదుపాయం ఈనెల 6 నుంచి 10 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

పాత బంగారు నగలను సరికొత్త డిజైన్లలో హాల్ మార్క్ నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆభరణాలను మార్చుకునే సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బైకన్ సుధా మధు, కార్పొరేటర్ మాస్టర్ శంకర్, నాయకులు నాగోల్ల లక్ష్మీనారాయణ, బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ అలెక్స్, అకౌంట్స్ మేనేజర్ సజేష్, పి ఆర్ ఓ పిప్పెర నరేందర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు మోటూరి మురళి గుప్తా, మహంకాళి విజయ్ కుమార్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతాం

- బిఎస్పీ జిల్లా అధ్యక్షులు సింగడి పాండు



మాట్లాడుతున్న బిఎస్పీ జిల్లా అధ్యక్షులు సింగడి పాండు

నవతెలంగాణ-బోధన్

త్వరలో జరగబోయ పార్లమెంటు ఎన్నికలలో బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అభ్యర్థిని పోటీలో నిలిపి తమ సత్తా చాటుతామని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు సింగడి పాండు అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలోగల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసి పార్లమెంటు ఎన్నికల్లో బీఎస్పీ ఎంపీ అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తామని అన్నారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పార్టీ లక్ష్యాలను వివరించాలన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన కుప్రియాల రాంచందర్, శంకర్‌ను సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి గైని గంగాధర్, అసెంబ్లీ అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షులు రెడ్డి సాయిలు, ప్రధాన కార్యదర్శి సాయికుమార్, కోశాధికారి సుభాష్, బీవీఎఫ్ కన్వీనర్ రవి కిరణ్ బోధన్ మండల నాయకులు పాల్గొన్నారు.

100శాతం ఉత్తీర్ణత సాధించాలి

- పదవ తరగతి విద్యార్థులకు సూచన

నవతెలంగాణ-ఎడపల్లి



మాట్లాడుతున్న విశ్రాంత ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి

పదవ తరగతి చదువుతున్న బాలబాలికలు వార్షిక పరీక్షల్లో కష్టపడి చదివి 100శాతం ఉత్తీర్ణత సాధించి పాఠ శాలకు, గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురా వాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నరేందర్‌రెడ్డి ఆకాం క్షించారు. ఇందూర్ ఉమెన్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యం లో మండల కేంద్రంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు, ఆంగ్ల మీడియం పాఠశాలలో పదవ తరగతి బాలికలకు ఇందూర్ ఉమెన్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలను, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నరేందర్ ఒడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలబాలికలు పేద కుటుంబాల నుంచి వచ్చిన వారని, వారికి తల్లిదండ్రులు సరైన సదుపా యాలు కల్పించలేని స్థితిలో ఉంటారని తెలిపారు. విద్యా ర్థులు కష్టపడి చదివినట్లయితే ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. ఉన్నత స్థాయికి చేరిన వ్యక్తుల జీవిత చరిత్రలను తెలుసుకోవాలని వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులైతే భవిష్యత్తులో వారు ఉన్నత చదువులు చదివే అవకాశం ఉందని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉన్నత పాటశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, దుర్గాప్రసాద్ ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

ఇంటింటికి అక్షింతల పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న హిందూ సంఘాల నాయకులు

నవతెలంగాణ-బోధన్

ఈనెల 22వ తేదీన ఆయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా అయోధ్య రామాలయ అక్షంతలను హిందూ సంఘాల నాయకులు ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం సాలుర మండల కేంద్రంలోని దళితవాడలో హిందూ సంఘాల కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ అయోధ్య రామాలయ అక్షితులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సతీష్, లక్ష్మణ్, ముకుందరావు, ప్రవీణ్, సుభాష్, చంటి, దత్తు అశోక్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడంలో ఉన్న ఆనందం.. మరొకటి లేదు

- లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబూరావు

జీవితంలో ఇతరులకు సేవ చేయడంలో ఉన్న ఆనందం మరొకటి లేదని, ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకుని, ప్రతి ఒక్కరూ సమయపాలన అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఘట్టమనేని బాబూరావు అన్నారు. లయన్స్ వైటల్ క్రియేటివిటి రీజియన్ మీట్ కార్యక్రమం ఆదివారం మండలంలోని బర్దిపూర్ శివారులోగల అమృతా గార్డెన్స్ లో అట్టహాసంగా ప్రారంభించారు. నిజామాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన లయన్స్ క్లబ్‌లు చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ సందర్భంగా లయన్స్ రీజియన్ చైర్మెన్ శంకర్ పురస్కారాలు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఘట్టమనేని బాబూరావు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. సేవాకార్యక్రమాలతో ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్‌లు నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో లయన్స్ క్లబ్‌లు నిరుపమాన సేవలందించాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సేవాభావాన్ని అలవర్చాలని, పిల్లల బర్త్ డే రోజు వారితో సేవా కార్యక్రమాలు చేయించాలని ఉద్బోధించారు. పిల్లలు మత్తుపదార్థాల వైపు వెళ్ళకుండా దృష్టి పెట్టాలని వారిలో దేశభక్తి భావాలు పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ రీజియన్ చైర్మెన్ మేడికొండ శంకర్,రీజియన్ కార్యదర్శి ద్వారకాదాస్ అగర్వాల్, జిల్లా గవర్నర్ పి.లక్ష్మి,ఉప గవర్నర్లు నగేష్ పంపటి,అమర్నాథ్ రావ్, పూర్వ గవర్నర్లు బివి బన్సల్ , పెంటయ్య, గంప రమేష్, బసవేశ్వరరావు, వీరేశం,గందాని శ్రీనివాస్,డాక్టర్ జనార్దన్ రెడ్డి,జీఆర్ సూర్యరాజ్,జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రావు, కోశాధికారి కొడాలి కిషోర్, ప్రోగ్రామ్ చైర్మెన్ డి.నర్సింహరాజు, కార్యదర్శి వేములపాటి రవీందర్, కోశాధికారి ధర్మరాజు, లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
సోమవారం | జనవరి 08, 2024 | www.navatelangana.com

సీతారామ స్వామి అక్షింతల ఊరేగింపు


అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి
మండలంలోని మోషన్ పూర్ లో ఆదివారం రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ పంపిన అయోధ్య సీతారామస్వామి ఆలయ పూజిత అక్షింతలను.. మహిళలు మంగళహారతులు, గ్రామస్తుల, యువకుల భక్తి పాటలతో గ్రామంలోని ప్రధాన వీధుల కూడా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దంపతులు బొంపల్లి ఉమాదేవి దత్తాద్రి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

నవతెలంగాణ-గాంధారి
సంక్రాంతి పండగ పురస్కరించుకొని గాంధారి మండల కేంద్రంలో సంక్రాతి క్రికెట్ ట్రోఫీని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎంపీటీసీ తూర్పు రాజులు ప్రారంభించారు. కార్యక్రమంలో రావుసాహెబ్ రావు, శివ హిందూసేన సభ్యులు సందీప్, నాగభూషణం, రమేష్, యూత్ సభ్యులు సంతోష్‌గౌడ్, సజన్‌రాజ్, కళ్యాణ్, నవీన్, నర్సింలు, ఉదయ్, రాహుల్, నిఖిల్, అమీర్, శివ, పవన్, మణితేజ్, చరణ్, శివాజీ, కుమ్మరి రవి తదితరులు పాల్గొన్నారు.

గుప్పుమంటున్న గుడుంబా

- తండాల్లో గుట్టుగా నాటుసారా తయారీ
- సరిహద్దులు దాటుతున్న దేశీదారు
- నామమాత్రంగా తనిఖీలు
- అధికారుల నిఘా కరువు



నవతెలంగాణ-లింగంపేట్
గ్రామీణ ప్రాంతాల్లో మారుమూల గ్రామాల్లో గిరిజన తండాల్లో గుడుంబా తయారీ గుప్పుమంటుంది. గత కొన్ని నెలలుగా సద్దుమణిగిన తయారీ తిరిగి మళ్లీ తండాలో పుంజుకుంటుంది. సంబంధిత ఎక్సైజ్ అధికారులు నామాత్రంగా తనిఖీ తనిఖీలు చేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తయారుచేసిన నేరుగా జిల్లా కేంద్రం నుంచి ఇతర మండల కేంద్రాలకు తరలుతోన్నట్టు సమాచారం. గుడుంబాపై నిషేదం అమల్లో ఉన్నా.. కొన్ని చోట్ల తయారీ చేస్తూ విక్రయిస్తుండటం గమనార్హం. ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నాటుసారా (గుడుంబ) సేవించడం ప్రాణాప్రాయం కావడంతో ప్రభుత్వం గుడుంబా తయారీపై నిషేదం విధించింది. అయితే పలు తండాల్లో ఇంకా నాటుసారా గుట్టుగా తయారు చేస్తూ విక్రయాలు చేపడుతున్నట్టు సమాచారం. ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలోని లింగంపేట్, గాంధారి మండలాల్లోని పలు మారుమూల తండాల్లో నాటుసారా తయారు చేస్తున్నట్టు సమాచారం. వాటిని జిల్లా కేంద్రంతో పాటు పలు మండల కేంద్రాలకు తరలిస్తూ విక్రయాలు చేపడుతున్నారు.

తక్కువ ధరకు లభించే నాటు సారా గుడుంబావైపు మొగ్గు చూపుతున్నారు దీంతో పల్లెల్లో పాటు పట్టణ ప్రాంతాల్లో నాటు సారా అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నాటు సారా విచ్చలవిడిగా తయారవుతుంది. జిల్లాలోని గాంధారి లింగంపేట్ ఎల్లారెడ్డి మాచారెడ్డి రామారెడ్డి జుక్కల్ పిట్లం పెద్దగడపగల్ మద్దూరు బాన్సువాడ తదితర మండలంలోని మారుమూల అటవీ ప్రాంతాల్లో గుడుంబా తయారీ నాటు సారు తయారు చేస్తున్నట్టు సమాచారం. కొందరు తమ కోసం ఇప్పపువ్వుతో మేలి రకం సారా తయారుచేసి ఒక్క లీటర్ 300 నుంచి 500 రూపాయలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఇప్ప పువ్వుతో పాటు బెల్లం కుళ్లిపోయిన అరటి పండ్లు ఇతర మత్తు పదార్థాలతో గుడుంబా తయారు చేసి దందా కొనసాగిస్తున్నారు. అధికారులు స్పందించి తండాల్లో తనిఖీలు చేపట్టాలని, గుడుంబా తయారు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

నామమాత్రంగా తనిఖీలు.. నిఘా కరువు

జిల్లాలో నిషేధిత గుడుంబా నాటు సారా దేశి దారులు అరికట్టడములో ఎక్సైజ్ శాఖ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా నాటు సారా తయారు చేసే అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని, తనిఖీలు చేస్తూ మామూలుకు అలవాటు పడుతున్నారని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో నామమాత్రంగా తనిఖీలు చేసి కేసులు కేసులు దాఖలు చేసిన సంఘటనలు చాలా తక్కువ ఎక్సైజ్ అధికారులు తాండలపై దాడులు చేసిన ఫలితం లేకుండా పోయింది. లింగంపేట్, గాంధారి, మాచారెడ్డి, రామారెడ్డి మండలాల్లో నాటు సార తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు విస్తృతంగా తనిఖీలు చేసి నాటు సారా గుడంబాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

చెరువులోపడి వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-ఎడపల్లి
మండలంలోని మంగళ్ పహాడ్ గ్రామానికి చెందిన మదారి నరసమ్మ (47),ఆదివారం చెరువులో పడి ఆత్మ హత్య చేసుకుంది. ఎస్సై భూపల్లి విక్రమ్ తెలిపిన వివ రాల ప్రకారం... మదారి నర్సమ్మ భర్త మదారి భూమయ్య మూడున్నర సంవత్సరాల నుండి కనిపించకుండా పోవడంతో మానసిక బాధతో కుంగి పోయిమనస్థాపా నికి గురైంది. ఈక్రమంలో గ్రామ సమీపానగల చెరువులో పడి నర్సమ్మ ఆత్మ హత్యకు పాల్పడినట్లు వివరించారు. మృతురాలి కూతురు సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్‌కు అవార్డులు


అవార్డులు అందుకున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్
ఆరు నెలలుగా నిర్వ హించిన వివిధ సేవా కార్య క్రమాలకు గాను రీజియన్ కాన్ఫరెన్స్‌లో రీజియన్ చైర్మె న్ శంకర్ ఇందూర్ క్లబ్ కు అవార్డులు ప్రధానం చేశా రు. ఆదివారం లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ వైటల్ రీజియన్ -3 మీట్ కార్య క్రమం అమృత గార్డెన్స్ లో నిర్వహించారు. ఇందులో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆరు నెలలుగా చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా అవార్డులు అందజేశారు .మంత్లీ రిపోర్టింగ్, ఉమెన్ హైజీన్ అవగాహన, ఇంటిమేట్ వాష్ పంపిణీ, ఉచిత ఆరోగ్య పరీక్షలు, హంగర్ రిలీఫ్, డయాబెటిక్ క్యాంప్, కాన్సర్ అవగాహన, హరితహారం, కార్యక్రమం తదితర విభాగాల్లో ఇందూరు క్లబ్ కు అవార్డులు దక్కాయి. ఎక్సలెంట్ బ్యానర్ ప్రెజెంటేషన్, ఎక్సలెంట్ స్క్రాప్ బుక్ అవార్డులు వచ్చాయి. వ్యక్తిగత విభాగంలో ఎక్సలెంట్ అధ్యక్షులుగా విజయానంద్, కార్యదర్శిగా చింతల గంగాదాస్, కోశాధికారిగా మచ్చ రవీందర్, ఉత్తమ లయన్‌గా అబ్బాయి లింబాద్రి, ఉత్తమ జోన్ ఆఫీసర్‌గా రమేష్ బాబు, ఉత్తమ కేబినెట్ ఆఫీసర్లుగా యాదగిరి, లక్ష్మి నారాయణ, కరిపె రవీందర్,గురుప్రసాద్, తాటికొండ సత్యనారాయణలు ఇందూర్ క్లబ్ నుండి అవార్డులు అందుకున్నారు.

టెట్ అర్హతతో సంబంధం లేకుండా పదోన్నతులు చేపట్టాలి : డిటిఎఫ్


మాట్లాడుతున్న శంతన్

నవతెలంగాణ-కంఠేశ్వర్
పాధ్యాయుల పదోన్నతులకు టెట్ పాసై ఉండాలనే నిబంధన తొలగించి వెంటనే పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్య క్షులు పి. శంతన్ డిమాండ్ చేశారు. ఆదివారం నిజామాబాద్ నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీఈఆర్టీలో డిప్యూటేషన్‌పై ఉన్న ఉపాధ్యాయులందరినీ పాఠశాలలకు రిలీవ్ చేయాలని, గత ప్రభుత్వ హయాంలో అనేకమంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్ల పేరుతో ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న వారిని కూడా రిలీవ్ చేయాలని అన్నారు. దీర్ఘకాలంగా ఉపాధ్యాయ నియామకాలు లేక ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమైందని, తక్షణమే మెగా డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ నియమాకాలు చేపట్టాలని, నూతన జాతీయ విద్యా విధానంలో మార్పులు చేసి అమలు చేయాలని, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు యం. బాలయ్య మాట్లాడుతూ జీవో 317 వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు సొంత జిల్లాలకు బదిలీ కావడానికి అవకాశం కల్పించాలని, ట్రెజరీలలో ఆమోదం పొంది ప్రభుత్వ వద్ద ఉన్న పెండింగ్ బిల్లుల చెల్లింపు తక్షణమే చేపట్టాలని, సిపిఎస్ రద్దుకు చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి విద్యారంగ సమస్యలపై చర్చించి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రాజన్న తో పాటు జిల్లా కమిటీ సభ్యులు బి. రాందాస్, పి.దాసు, గంగారం, రాజేష్, బాలరాజు, ఒమాజీ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర మట్కా నిర్వాహకుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్


నవతెలంగాణ-కంఠేశ్వర్
అంతర్రాష్ట్ర మట్కా నిర్వాకుడిని నిజామాబాద్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు నిజామాబాద్ ఏసిపి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఏసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ, మహారాష్ట్రలో పెద్ద ఎత్తున మట్కా నిర్వహిస్తున్న నిర్వాహకుని అరెస్టు చేసి నిందితుడికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఐదు సంవత్సరాలుగా తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాలలో పెద్ద ఎత్తున మట్కా నిర్వహిస్తున్న మొహమ్మద్ జమీర్ అనే నిందితుడిని ఆదివారం నిజామాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. సదరు నిందితుడు ఐదు సంవత్సరాలుగా తన బుకీల ద్వారా అనేకమంది అమాయక ప్రజలని మట్కా వ్యాపారంలోకి లాగి వారికి డబ్బు ఆశ చూపించి వారిని కోట్ల రూపాయలలో మోసం చేసినట్టుగా పోలీసుల విచారణలో తేలింది. నిందితుడు మహారాష్ట్రలోని నాందేడ్, ధర్మాబాద్, బిలోలి, వర్ధ, అకోల, అమరావతి ఇంకా అనేక ప్రాంతాలలో మట్కా నిర్వాహకులతో తనకున్న సంబంధాల ద్వారా మట్కాలో ప్రతిరోజు విజేతలుగా రాబోయే నెంబర్లను తీసుకొని వాటిపై తన ఏజెంట్స్, బుకీల ద్వారా భారీ ఎత్తున బెట్టింగ్ చేసి కోట్ల రూపాయల లావాదేవీలు జరిపినట్టుగా పోలీసుల విచారణలో తేలింది. నిందితుడు జమీర్ ముఖ్య అనుచరుల గురించి పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. నిందితుడు జమీర్ కూడబెట్టిన ఆస్తులపై కూడా లోతైన విచారణ జరుపుతున్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ప్రజలు మట్కా ఏజెంట్లని నమ్మి మోసపోవద్దని, మట్కా ఆడిన, నిర్వహించిన, బుకీలుగా వ్యవహరించిన చట్టరిత్యా తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు. నిందితుడు జమీర్‌ని అరెస్టు చేసి నిజామాబాదులో భారీ ఎత్తున జరిగే మట్కా వ్యాపారానికి అడ్డుకట్ట వేసిన అధికారులు టాస్క్ ఫోర్స్ ఏసిపి రాజశేఖర్ రాజు, నిజామాబాద్ ఏసిపి కిరణ్ కుమార్, టాస్క్ ఫోర్స్ సిఐలు అజయ్‌బాబు, అంజయ్య, నార్త్ రూరల్ సీఐ సతీష్, ఐదవ పట్టణ ఎస్సై అప్పారావు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది రాములు, అనిల్, సుధాకర్, లక్ష్మన్న, రామచందర్, అజమ్‌లను ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ పోలీస్ నిజామాబాద్ అభినందిస్తూ వీరికి రివార్డులు ప్రకటించడం జరుగుతుందని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్ కుమార్ తెలిపారు.

ముదిరాజ్ జెండా ఆవిష్కరణ


జెండా ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సభ్యులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
నాగిరెడ్డిపేట్ మండలంలోని వాడి గ్రామంలో ఆదివారం ముదిరాజ్ సోదరులు ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజులందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ గ్రామ అధ్యక్షులు పుట్టి నరసింహులు, ఉపాధ్యక్షులు పక్కింటి నరసింహులు, కోశాధికారి మల్యు తిరుపతితో పాటు ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పార్లమెంటరీ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు


పార్లమెంటరీ సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో ఆదివారం జహీరాబాద్ పార్లమెంటరీ సన్నాహక సమావేశం నిర్వహించగా.. నాగిరెడ్డిపేట్ నుండి బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధివిధానాలపై కేటీఆర్ దిశా నిర్దేశం చేసినట్లు జెడ్పీటీసీ మనోహర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మాల్ తుమ్మెద సొసైటీ చైర్మన్ నర్సింలు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కృష్ణ పాల్గొన్నారు.

నెంబర్‌ప్లేట్ లేకుంటే సీజ్ చేస్తాం

- ఎస్సై ప్రభాకర్


వాహనంను తనిఖీ చేస్తున్న ఎస్సై ప్రభాకర్

నవతెలంగాణ-లింగంపేట్
వాహనదారులకు నెంబర్ ప్లేట్లు లేకపోతే అట్టి వాహనాలను స్విజ్ చేస్తామని లింగంపేట ఎస్సై ప్రభాకర్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. 20 వాహనాలను తనిఖీ చేసి సరైన ధృవపత్రం లేకపోవడంతో వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు కచ్చితంగా నంబర్ ప్లేట్లు వేయించుకోవాలని సూచించారు. రాష్ట్ర పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ఇప్పటికే పలు గ్రామాల్లో నంబర్ ప్లేట్లు లేని వాహనదారులకు సూచించినట్టు తెలిపారు. వాహనదారులు కచ్చితంగా హెల్మెట్‌ను ఉపయోగించాలన్నారు. వాహనదారులు మద్యం సేవించి నడిపించినట్లయితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అతివేగం ప్రమాదకరమని వేగంగా వాహనాలు నడపరాదన్నారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ రమేష్, రాజేష్, హెూంగార్డులు యాదగిరి స్వామి గౌడ్ షబ్బీర్ తదితరులు ఉన్నారు.

వివేకానంద జయంతి పురస్కరించుకొని

12న మెగా రక్తదాన శిబిరం


మాట్లాడుతున్న ప్రతినిధులు

నవతెలంగాణ-కామారెడ్డి
వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీనా ఏర్పాటు చేస్తున్న మెగా రక్తదాన శిబిరానికి యువత ఎక్కువ సంఖ్యలో ముందుకు రావాలని కామారెడ్డి రక్త దాతల సమూహ అధ్యక్షుడు డాక్టర్ వేద ప్రకాష్ అన్నారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో స్వామి వివేకానంద జయంతి జనవరి 12ను పురస్కరించుకొని కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైష్ ఫెడరేషన్ (ఐవిఎఫ్), ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని కామారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రక్తనిధి కేంద్రంలో రక్త నిల్వలు లేకపోవడం వలన పేషెంట్లు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు తెలియజేయడంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రక్తదానం చేయాలనుకున్న రక్తదాతలు వారి యొక్క వివరాలను 9492874006 నంబర్ తెలియజేయాలని, రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంస పత్రాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలోరక్తదాతల సమూహం ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్, ఉపాధ్యక్షులు జమీల్, కిరణ్, పుట్ల అనిల్, సలహాదారులు రమణ, ఎర్రం చంద్రశేఖర్, శ్రీకాంత్ రెడ్డిలు పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి చేయాలి

- విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు
- చిప్ప దుర్గాప్రసాద్


మాట్లాడుతున్న చిప్ప దుర్గాప్రసాద్

నవతెలంగాణ-కామారెడ్డి
ప్రజా ప్రతినిధులు, అధికారులు దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేయాలని విజ్ఞాన్ వికలాంగుల సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్పదుర్గ ప్రసాద్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాఆరు. ప్రజా పాలన కార్యక్రమం నిరంతర ప్రక్రియలో భాగంగా దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక చొరవ తీసుకుని ఆరు గ్యారంటీలా పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే వారి వద్దకు వెళ్లి దరఖాస్తులు తీసుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారంలో దివ్యాంగుల ప్రత్యేక కాలం కేటాయించినట్లయితే దివ్యాంగుల కుటుంబ ఆర్థిక స్థితిగతులు అందరికీ తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా పరికరాల కోసం అదేవిధంగా ఆర్థక ఋణాల కోసం పెండింగ్‌లో ఉన్న వటిని తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో దివ్యాంగుల సంక్షేమం కోసం మహా ధర్నా చేపడతమన్నారు. ఈకార్యక్రమంలో సబ్ కమిటీ డైరెక్టర్ గాడి నర్సింలు, శంకర్ స్వామి, రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఐయన్‌టీయూసీ-327 యూనియన్‌లో చేరికలు


ఐయన్‌టీయూసీలో చేరిన పలువురు

నవతెలంగాణ-దోమకొండ
బీబీపేట్ మండల కేంద్రంలో విద్యుత్ శాఖ ఐయన్‌టీయూసీ -327 యూనియన్ జిల్లా అధ్యక్షులు సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యుత్ శాఖలో పని చేస్తున్న సబ్ స్టేషన్ ఆపరేటర్‌లు, సిబ్బంది, కార్మికుల కోసం అహర్నిశలు నిరంతరం సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. విద్యుత్ శాఖ కార్మికుల కోసం పని చేస్తున్న ఐయన్‌టీయూసీ 327 యూనియన్‌లో సుమారు ముప్పై మంది ఆర్టిజన్ కార్మికులు యూనియన్‌లో చేరినట్టు తెలిపారు. విద్యుత్‌శాఖలోని కార్మికుల సమస్యలు పారష్కరించే ఏకైక యూనియన్ ఐ యన్ టీ యూసీ 327 యూనియన్ తోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా సెక్రటరీ వై. మెహర్ బాబా జిల్లా నాయకులు జి. శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, డివిజన్ సెక్రటరీ కే. తిరుపతి గౌడ్,ఎల్లారెడ్డి డివిజన్, సెక్రటరీ డి.తిరుపతి రత్నకుమార్, బ్రమ్మం, నయీమ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం


ఉపాధ్యాయురాలికి సన్మానిస్తున్న మంత్రి

నవతెలంగాణ-జుక్కల్
ఉత్తమ ఉపాధ్యాయురాలిని రాష్ట్ర పంచా యత్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అదివారం సన్మానించారు. జుక్కల్ మండలంలోని లొంగన్ ఎంపిపీఎస్ ప్రవీణ ఎస్టీటీ తెలుగు టీచంగా ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తోంది. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సీవీఆర్, జీవిఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సావిత్రి బాయి పూలే జయంతి వారోత్సవాలలో భాగంగా ఉత్తమ టీచర్ ఆవార్డును అందించారు. లొంగన్ గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విద్యార్థులను మంచి బావిపౌరులుగా తీర్చి దిద్దడానికి తన వంతుగా కృషి చేస్తున్నందుకు విద్యార్థుల అభ్యాసన నైపుణ్యం పెంపొందించడంలో తగిన ప్రణాళిక రూపొందిస్తు, వాటిని అమలు చేస్తూ, విద్యార్థుల ప్రతిభను వెలికి తీసీ ఉత్తములుగా తీర్చి దిద్దుతామని ఆవార్డు గ్రహిత ప్రవీణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅథితి రాష్ట్ర మంత్రి సీతక్క, మండలానికి చెందిన పలువురు టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపైనుండి జారీ పడి గీత కార్మికుడు మృతి



నవతెలంగాణ-ఆర్మూర్
మండలంలోని సుర్బిర్యాల్ గ్రామంలో ఆదివారం గీత కార్మికుడు చెట్టుగీసే సమయంలో కిందపడి మృతిచెందాదడు. తిరుపతి గౌడ్(46) చెట్టు గీసే సమయంలో నిచ్చెన పైనుండి జారి కింద పడి గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబం ఆయనది కుటుంబ పెద్ద దిక్కును కోల్పోడంతో ప్రభుత్వం ఆదుకోవాలని గౌడ కులస్తులు కోరుతున్నారు.

కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి నూతన 2024 సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్ మాట్లాడుతూ.. మర్యాదపూర్వకంగా కలిసి దళితుల సమస్యల మీద గతంలో ఎస్సీ కార్పొరేషన్ 2018-2019సంవత్సరానికి సంబంధించిన రుణాలు ఆగిపోయిన వాటిని పునరుద్ధరించాలని కోకారు. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను తక్షణమే నియమించాలని వీటిపై అసెంబ్లీలో చర్చించి దళితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నలవాల నరసయ్య, సిరికొండ మండల అధ్యక్షులు దేవుడు గల్ల శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు రాజు, జిల్లా కమిటీ సభ్యులు నెహ్రూ, సభ్యులు పాల్గొన్నారు.

రూరల్ ఎమ్మెల్యేను కలిసిన గౌడ సంఘ సభ్యులు



ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన గౌడ సంఘం సభ్యులు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రానికి చెందిన గౌడ సంఘం సభ్యులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు మనోహర్‌రెడ్డి, చెలిమేల శ్రీనివాస్, గౌడ సంఘ సభ్యులు లింబాగౌడ్, గంగాధర్ గౌడ్, రమేష్ గౌడ్, నర్సాగౌడ్, సురేందర్ గౌడ్, ప్రసాద్ గౌడ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థి కుటుంబానికి

నిత్యవసరాలు, ఆర్థిక సహాయం అందజేత



సరుకులు, ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ విద్యార్థి కుటుంబానికి స్కూల్ ప్రిన్సిపాల్ నిత్యావసరుకు లు, ఆర్థికసాయం ఆదివా రం అందజేశారు. అయిదవ తరగతి చదువుతున్న మండలంలోని బ్రాహ్మణ పల్లి గ్రామానికి చెందిన జశ్వంత్ తండ్రి ముద్దాల సాయన్న ప్రమాదావశాత్తు మరణించారు. ఆ కుటుంబానికి ఆయనే ఆధారం. ఈ పరిస్థితి గమనించిన స్కూల్ ప్రిన్సిపాల్ యస్.రవికాంత్ స్పందించి నాలుగైదు నెలలకు సరిపోయే నిత్యావసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ పల్లి గ్రామ సర్పంచ్ యం.లత దేవరాజు మరియు ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి మరియు బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ స్టాఫ్ పాల్గొన్నారు.

ప్రతి రోజూ ధ్యానం చేయాలి



మాట్లాడుతున్న హరాచారి నారాయణస్వామి

నవతెలంగాణ-ఆర్మూర్

సుప్రసిద్ధ దేవస్థానం సిద్దులగుట్ట శ్రీ నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహా శక్తి క్షేత్రంలో ఆదివారం ధ్యాన, కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హరాచారి నారాయణ స్వామి , తెలంగాణ రాష్ట్ర పిరమిడ్ సేవాదల్ అధ్యక్షులు, ధ్యాన గద్దర్ భూపతి రాజు విచ్చేసి మాట్లాడారు. పిరమిడ్ ధ్యాన మందిరాలు గొప్ప శక్తి క్షేత్రాలని, సిద్దుల గుట్టపై ఉన్న ఈ పిరమిడ్ లో ధ్యానం చేసి జ్ఞానం పొందాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ధ్యానం చేస్తూ శాకాహారం భుజించాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద రెండవ పిరమిడ్ ఆర్మూర్ సిద్ధు లగుట్టపై ఉండడం తెలంగాణ రాష్ట్రానికి గొప్ప తలమానికమన్నారు. కార్యక్రమంలో పి ఎస్ ఎస్ ఎమ్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి, నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ చైర్మన్ తిరుమల గంగారాంరెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నల్లగంగారెడ్డి, సభ్యులు కూనింటి శేఖర్ రెడ్డి, అమరవాజి శ్రీనివాస్, పెంబర్తి నారాయణ, రాజారామ్, సంతోష్ కుమార్, నాగంపేట శ్రీనివాస్, అమృత రావు, దుబ్బాక గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో స్వచ్ఛ కాలనీ



చెత్త ఏరివేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్న లిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం క్లాక్ టవర్ వద్ద శ్రమదానం చేశారు. అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రెండు గంటలు అనే నినాదంతో 28 వారాలుగా స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ వారం తమ కాలనీ ఎంట్రన్స్‌లో ఉన్న క్లాక్ టవర్ వద్ద శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అడ్డదిడ్డంగా పెరిగిన ముళ్ల పొదలను, పిచ్చి మొక్కలను, వ్యర్థాలను, చెత్తచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గోసికొండ అశోక్ మాట్లాడుతూ పట్టణానికి తలమానికమైన క్లాక్ టవర్ నిర్వహణ సరిగా లేదని, వంద అడుగుల జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేసిన అధికారులు పరిశుభ్రత పై దృష్టి పెట్టకపోవడం సరికాదని పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి క్లాక్ టవర్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, జాతీయ జెండా ఔన్నత్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సమాచార హక్కు చట్టం అధ్యక్షులు, యువ న్యాయవాది గటడి ఆనంద్, కమిటీ ఉపాధ్యక్షులు కొక్కెర భూమన్న, సుంకే శ్రీనివాస్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, కార్యదర్శి కొంతం రాజు, ఆలయ కమిటీ కోశాధికారి ఎర్ర భూమయ్య, ఎస్సారెస్పి డీఈ గణేష్, బాస మోహన్, బొల్లు జీవన్, పురపాలక ఉద్యోగి వెన్న మోహన్, హరితహారం సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

అనువైన స్థలాన్ని రెండు రోజుల్లో తేల్చాలి

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- వంద పడకల ఆసుపత్రి స్థలం పరిశీలన
- స్థలం మార్చాలని గ్రామస్తుల సూచన



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రంలో గత ప్రభుత్వం వందపడకల ఆసుపత్రి నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దానికి అనుగుణంగా అప్పుడే ఎన్నికలు సమీపించడంతో అందుకు కావలసిన స్థల పరిశీలన చెయ్యాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశించాగా అప్పుడు అధికారులు హుటాహుటిన మండలకేంద్రములోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఆసుపత్రి నిర్మించేందుకు అనువైన స్థలాన్ని నిర్ణయించారు. ఉన్నతాధికారులు సైతం పరిశీలించి మూడున్నర ఎకరాల్లో ఆసుపత్రి నిర్మించేందుకు ఒప్పందానికి వచ్చి ప్రభుత్వానికి నివేదిక అందించారు. అంతలో స్థలాన్ని ఫైనల్ చేసి అధికారులు స్థలం చదును కార్యక్రమాలు పూర్తి చేసి గత నవంబర్ 5న అప్పటి ఆరోగ్యమంత్రి హరీష్ రావుతో భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఇంతలో ఎన్నికలు అనంతరం ప్రభుత్వం మారింది. దీంతో ఆసుపత్రి నిర్మాణం పనులు జరగలేదు. ఇటీవల ఆసుపత్రి నిర్మాణపు పనుల్లో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని వాటిని ఒకసారి పరిశీలించి ఎమ్మెల్యే అభిప్రాయాన్ని తెలుపాలని అధికారులు కోరారు. శనివారం ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే ఆసుపత్రికి స్థలాన్ని పరిశీలించారు. అధికారులతో మాట్లాడగ స్థలం తక్కువ అవుతుందని, ఇక్కడ మూడున్నర ఎకరాలు భూమి ఉందని, పూర్తిస్థాయి భవనాలు రావడం కష్టంగా ఉందని తెలిపారు. అలాంటప్పుడు ఈ విషయాన్ని అప్పుడు ఎందుకు చెప్పలేదని అధికారులకు ప్రశ్నించారు. పాత భవనం ఉన్న చోటనే నూతన భవనాలు బాగుంటాయిన అక్కడ 5 ఎకరాల స్థలం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అక్కడే నిర్మిస్తే ప్రస్తుతం ఉన్నట్లుండి,ప్రజలకు వైద్య సేవలు ఇబ్బందిగా మారుతాయని, మరో చోటికి మార్చేందుకు మార్గం ఏమైనా ఉందా అనే విషయంలో మండల కేంద్రంలోని బాలర వసతి గృహం ఖాళీగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రిని అక్కడకు షిఫ్ట్ చేసి, పాత ఆసుపత్రి భవనాలు శిదిలావస్థకు చేరినందున వాటిని తొలగించి అదేచోట నూతన భవనం నిర్మించినట్లయితే బాగుంటుందని అన్నారు. భవనాలు పూర్తి అయ్యే వరకు సుమారు 2నుండి 3 సంవత్సరాల సమయం పట్టవచ్చని, అప్పటి వరకు మండల కేంద్రంలోని హాస్టల్ భావనలో వైద్య సేవలు అందిస్తే బాగుంటుందని ఎమ్మెల్యే దృష్టకి తెచ్చారు. సరే అది వైద్య సేవలకు సరిపోతుందా అని వైద్యులకు అడుగగా సరిపోదని సమాధానం ఇవ్వడంతో అప్పుడు ఎందుకు తప్పు తోవ పట్టించారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిగిందేదో జరిగింది ఇప్పుడు ఆసుపత్రి నిర్మాణం ఎక్కడ కట్టితే బాగుంటుందో, అధికారులు, స్థానిక నాయకులు కలిసి పరిశీలించాలని తెలిపారు. ఎప్పటిలాగా వైద్య సేవలకు ఇబ్బందులు లేకుండా, హాస్టల్ భవనం పరిశీలించండని అన్నారు. హాస్టల్ పక్కనే మరో హాస్టల్ ఉందని అది ప్రస్తుతం కొనసాగుతుందని అవసరం అనుకుంటే అట్టి హాస్టల్‌ను కూడా తీసుకొని రెండింటిలో ఆసుపత్రి కొనసాగించే విధంగా చూడాలన్నారు. ప్రస్తుతం ఒక హాస్టల్‌లో ఉన్న విద్యార్థులను మరో ప్రభుత్వ భవనం చూసి అక్కడకు మార్చినట్లయితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని కాంగ్రెస్ మండల నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా ఆసుపత్రి ఎక్కడ కట్టితే బాగుంటుందో తేల్చాలని, భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకొని అందరికి ఆమోదయోగ్యంగా ఉండే విధంగా ఫైనల్ చెయ్యాలని రెండు రోజుల్లో నివేదిక అందించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఏదేమైనప్పటికి వంద పడకల ఆసుపత్రి మండల కేంద్రంలో వచ్చింది వాస్తవమే అయినప్పటికీ అదెక్కడా నిర్మాణం జరుగుతుందో మరో వారం, ఓదిరోజుల్లో తేలనుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఎక్కడ కట్టిన ప్రజలకు మేలు జరిగే అవకాశం ఉన్నందున అధికారులు త్వరగా స్థల పరిశీలన చేసి పనులు ప్రారంభించేందుకు కృషి చెయ్యాలని మండల వాసులు కోరుతున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని జక్రాన్‌పల్లి ఫాస్ట్ రేట్ సిఎస్ఐ వెస్లీ చర్చిలో దక్షిణ ఇండియా మెదక్ అధ్యక్ష మండలం క్యాలెండర్‌ను పాస్టర్ శశి ప్రకాష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జక్రాన్‌పల్లి పాస్ట్ రేట్ కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

- అఖిల భారత రైతు కూలి సంఘం

నవతెలంగాణ-సిరికొండ



రైతాంగ సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్ల రామడుగు గ్రామంలో నిజామాబాద్ జిల్లా కార్యవర్గం సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు బిక్షపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ మాఫీ చేయాలని, వరి పంటకు 500 రూపాయలు బోనస్ ప్రకటించాలని, ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇండ్లు లేని పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఐదు లక్షలు రూపాయలు ఇవ్వాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, పంటలకు మద్దతు ధర చట్టాన్ని పార్లమెంటులో పెట్టాలని అన్నారు. లేకుంటే రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వాని గద్దెదించాలని రైతులకు వారు పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు బాకారం గంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉషన్న, దత్తాద్రి, రాజన్న, నారాయణ, పోతిరెడ్డి, సంతోష్, దుర్గన్న, భాస్కర్, శంకర్, సురేష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు

ప్రమాదకరంగా ఇనుప విద్యుత్ స్తంభాలు

నవతెలంగాణ-పొతంగల్

మండలంలో పలు గ్రామాల్లో ఇప్పటికి చాలాచోట్ల ఇనుప విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. కొన్నిచోట్ల ఎర్తింగ్ వస్తోంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఇనుప విద్యుత్ స్తంభాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మున్నూరుకాపుల ఐక్యమత్యంతోనే అభివృద్ధి సాధ్యం

- టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్

నవతెలంగాణ- బోధన్



సన్మానిస్తున్న సంఘం సభ్యులు

మున్నూరు కాపుల ఐక్యమత్యంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ స్పష్టం చేశారు. ఆదివారం బోధన్ పట్టణం రాకాసీపేట్ మున్నూరుకాపు సంఘంలో బోధన్ పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బీర్కూరు బుజ్జి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో గంగాశంకర్ మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు తమ కులం అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎవరు ఏ పార్టీలో ఉన్నప్పటికీ మున్నూరు కాపు సంఘం ప్రతినిధిగా ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, అప్పుడే సంఘం అభివృద్ధి బాటలో పయనిస్తుందని అన్నారు. వార్డులు, గ్రామాలలో మున్నూరు కాపు కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు ఆర్థిక పరిపుష్టి కలిగించే విధంగా ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి మున్నూరుకాపులో బీద కుటుంబాలను ఆదుకునేందుకు ప్రణాళికలను రూపొందించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. బేషజాలకు వెళ్లకుండా మున్నూరుకాపు సంఘం అభివృద్ధి కోసం ప్రతీ ఒక్కరు తమ వంతుగా కృషి చేయాలని అప్పుడే సమాజంలో మున్నూరుకాపులకు మంచి గుర్తింపు లభిస్తుందని ఈ విషయంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని గంగాశంకర్ హామీ ఇచ్చారు. క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం క్యాలెండర్ ముద్రణకు సహకరించిన దాతలను, సమావేశ నిర్వహణకు చేయూతనిచ్చిన వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు బోధన్ పట్టణ అధ్యక్షులు బీర్కూరు బుజ్జి, కార్యదర్శి మాసుల శ్రీను, ఉపాధ్యక్షులు సాయిలు, గంగాధర్, ఎంఎల్ బాబు, యూత్ అధ్యక్షులు యేషాల రవి, ఎర్రం సాయిలు, బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు సంజీవ్, ఎడపల్లి ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు కంజర్ వినాయకరాజు, నవీన్, అజయ్, నర్సింగ్ తో పాటు సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

లయన్స్ భవనం నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణం శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు పాల్గొని శంకుస్థాపన చేశారు . ఈ భవనం 16 లక్షల వ్యయంతో కంటి ఆసుపత్రి నిర్మాస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ గవర్నర్ లక్ష్మి జి ఆర్ సూర్య రాజ్ లయన్స్ ప్రతినిధులు సాగర్ రెడ్డి, దినేష్ పటేల్, చాకూలింగం, సిహెచ్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి కేరాఫ్ మామ్ హెల్త్ కేర్

- బోధన్‌లో ఆధునిక ఫిజియోథెరపి వైద్యం
- దీర్ఘకాలిక రోగాలకు ఉత్తమమైన చికిత్సలు
- లైఫ్ టైం ఫ్రీ డెమో థెరపీ
- ఫిజియోథెరపిస్ట్ రైసాబేగం



మాట్లాడుతున్న దాక్టర్ రైసా బేగం

నవతెలంగాణ-బోధన్

నేటి ఆధునిక యుగంలో మనిషి యాంత్రిక జీవనానికి అలవాటు పడి ఎన్నో అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. ఉరుకులు పరుగుల కాలంలో తీరిక లేని జీవితంలో రోజంతా శ్రమించి ఎన్నో టెన్షన్‌లతో ఎన్నో రకాల వ్యాధులకు గురవుతున్నారు. వీటన్నిటికీ పరిష్కారంగా బోధన్ పట్టణంలో మామ్ హెల్త్ కేర్ సెంటర్ సహజ చికిత్సతో సైడ్ ఎఫెక్ట్ లేని వైద్యాన్ని అందిస్తున్నారు. రోగనిరోధక శక్తిని పెంచి ఆరోగ్యవంతమైన జీవితానికి నాంది పలికేలా హెల్త్ థెరపీ చేస్తున్నారు. రోగ నిరోధక శక్తి బలంగా ఉన్నప్పుడు శరీరం అంటు వ్యాధులు, వైరస్ ల నుండి కాపాడుతుందని, జీవనశైలి వల్ల కలిగే ఒత్తిడి నుండి శరీరం సురక్షితంగా ఉంటుందని, మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికి పలు విధమైన చికిత్సలను మామ్ హెల్త్ కేర్ సెంటర్ వైద్యులు అందిస్తున్నారని తెలిపారు. ఇదులో థెరపీని క్రమం తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, శారీరక, మానసిక అలసట, ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి, శరీర ఉష్ణోగ్రతను సమతుల్యం చేయడానికి, శరీరంలో రక్త ప్రసరణ సాఫీగా జరగడానికి, రోగ నిరోధక శక్తిని పెంపొందించడానికి మామ్ హెల్త్ థెరపి సహాయపడుతుందని, తద్వారా వ్యాధి సంభవనీయతను తగ్గిస్తుందని చెప్పారు. ఎముకలు దృఢంగా ఉండేందుకు, వెన్నెముకకు సహజంగా సమలేఖనం చేయడానికి, పించ్డ్ సిరలపై ఒత్తిడి తగ్గించడంలో మామ్ హెల్త్ థెరపి పనిచేస్తుందని, అదనపు కొవ్వును తొలగించడం ద్వారా బరువు తగ్గడంలో శరీరంలోని టాక్సిన్స్‌ను బయటకు పంపడంలో శరీరం స్వయంగా నయం కావడానికి హెల్త్ థెరపీ ఉపయోగపడుతుందని తెలిపారు. మామ్ హెల్త్ థెరపీ సహజంగా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుందని, జీర్ణక్రియ, శ్వాసక్రియ, జీర్ణ క్రియలను నియంత్రించడంలో సూర్యుని యువకిరణాలు ప్రయోజనంగా ఉండడంలో సహాయపడుతుందని చెబుతున్నారు. మామ్ హెల్త్ కేర్ అందిస్తున్న వైద్య సేవలు....

మామ్ హెల్త్ కేర్ సెంటర్‌లో ఎన్నో రకాల రుగ్మతలకు హెల్త్ థెరపీ ద్వారా చికిత్సలు అందిస్తున్నారు. అందులో డయాబెటిస్, రక్తపోటు, ఊబకాయం, కిడ్నీలు, గుండె సమస్య, పక్షవాతం, కాలేయం, మోకాలి నొప్పి, మలబద్ధకం, కీళ్ల నొప్పులు, కొవ్వు కాలేయం, నిద్రలేమి, బలహీనత, వెన్నునొప్పి, సైనసైటిస్, కంటి సమస్య, డిస్క్ సమస్య, సర్వైకల్, హేమో రాయిడ్స్, థైరాయిడ్, చర్మ సమస్యలు, కాణీతి, గ్యాస్, ఆమ్లత్వం,పుండ్లకు చికిత్సలు అందిస్తున్నారు. అలాగే ప్రత్యేక స్టోన్ తో చికిత్స అందిస్తున్నారు. మామ్ స్టోన్ కంపెనీ వారి దానితో 21 సహజ మూలకాలలో తయారు చేసిన ఈ స్టోన్ తో శరీరానికి ఫారిన్ ఫ్రారెడ్ కిరణాలను సూర్యుని యువ కిరణాల వంటి కిరణాలు)అందిస్తుందని, సహజ అంశాలతోపాటు ఈ రాయి ఆయస్కాంత ప్రభావం కలిగి ఉంటుందని, దాంతో శరీరానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు.



మామ్ హెల్త్ కేర్‌లో ఉత్తమ వైద్యం అందిస్తున్నాం...



బోధన్ పట్టణంలో షర్పతి కెనాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మామ్ హెల్త్ కేర్ సెంటర్లో దీర్ఘకాలిక రుగ్మతలకు హెల్త్ థెరపీ చికిత్సలు అందిస్తున్నాం. హెల్త్ థెరపిలో భాగంగా మసాజ్, అక్యుప్రెషర్, మోక్షిబస్షన్, ఫైర్ రేస్, కైరో ప్రాక్టిక్, ఈటిఎస్ థెరపీ, బయోవేవ్ థెరపి లాంటి చికిత్సలు అందిస్తున్నాం. మా హెల్త్ కేర్ థెరపి ద్వారా ఎన్నో నొప్పులకు పరిష్కారం చూపిస్తున్నాం. మా హెల్త్ కేర్ సెంటర్లో 40 నిమిషాల థెరపీతో హైటెక్నాలజీ మిషన్‌తో ఎన్నో ప్రయోజనాలను అందిస్తున్నాం. లైఫ్ టైం ఫ్రీ డెమోథెరపి నిర్వహిస్తున్నాం. కావున జిల్లాలోని ప్రజలు హెల్త్ థెరపీని సద్వినియోగం చేసుకోవాలి.

రైసా బేగం. ఫిజియో థెరపిస్ట్, జోనల్ మేనేజర్

వాహనాలు తనిఖీ



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని జాతీయ రహదారి161 అంజని గేటు వద్ద ఎస్ఐ కొనారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు పాత చాలాన్లను వెంటనే చెలించాలని అన్నారు. జాతీయ రహదారిపై ప్రయాణం చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలు నడిపి ఇంటికి చేరుకోవాలని తెలిపారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకొని ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసే సమయంలో హెల్మెట్లు తప్పక ధరించి జాతీయ రహదారి భద్రత నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్ భవనంలో బోధి బుడోకాన్ కరాటే సీనియర్ మాస్టర్ కాంబ్లె ముకేష్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ గ్రేడింగ్ పరీక్షకు 180 మంది హాజరయ్యారు. వీరిలో 66 మంది ఎల్లో బెల్ట్, 37 మంది ఆరెంజ్ బెల్ట్, 24 మంది గ్రీన్ బెల్ట్,18 మంది బ్లూ బెల్ట్,16 మంది పర్పల్ బెల్ట్,19 మంది బ్రౌన్ బెల్ట్ సాధించారు. ఈ సందర్భంగా కాంబ్లె ముకేష్ కుమార్ సీనియర్ మాస్టర్ విద్యార్థులకు ఉద్యేశించి కరాటే ప్రముఖ్యతను వివరించారు. ఈ గ్రేడింగ్ టెస్ట్‌కి సీనియర్ మాస్టర్స్, దేవిదాస్, రాము, ఆకాష్, ప్రేమ్, మాస్టర్‌లు పరీక్షకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సీనియర్ శిక్షకులు పవార్ సంధ్య, రాహుల్, కదం సునీత, అంజు, అంగీరస్ బౌద్ధ అనుష్క, బుధగయా పాల్గొన్నారు.

క్రీడల్లో విజయంకోసం ముందుకు సాగాలి

- అట్టహాసంగా ప్రారంభమైన జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్
- 28 రాష్ట్రాల నుండి హాజరైన క్రీడాకారులు
- అలరించిన నృత్యాలు



జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్, తదితరులు



గౌరవవందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి

67వ నేషనల్ స్కూల్ గేమ్స్ 2024 కబడ్డీ టోర్నమెంట్ (అండర్-17 బాలురు) పోటీలు అట్టహాసంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. 28 రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారుల వందన సమర్పణతో కార్యక్రమం ప్రారంభంకాగా ముఖ్య అతిథులుగా హాజరైన కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ప్రముఖ సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ఆటల్లో పాల్గొనడానికి కామారెడ్డికి వచ్చిన వివిధ రాష్ట్రాలకు చెందిన అతిథులకు ధన్యవాదాలు తెలిపారు. జాతీయ కబడ్డీ క్రీడా పోటీలు కామారెడ్డిలో జరగడం సంతోషంగా ఉందని, క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ సహకరిస్తామని అన్నారు. ఆ సౌకర్యాలను చూస్తున్న అధికారులు క్రీడాకారులకు వారితో వచ్చిన పిఈటిలకు వసతుల్లో లోటు లేకుండా చూడాలన్నారు. క్రీడల్లో జయాపజయాలు అనివార్యమని, అపజయానికి గురైన వారు కృంగిపోకుండా ముందుకు సాగాలని, ముందు ముందు మరిన్ని విజయాలను సొంతం చేసుకోవడానికి కృషి చేయాలని అన్నారు. క్రీడల్లో యువతకు పెద్దపీట వేయాలని, అందుకు పూర్తిగా సహకారాన్ని అందిస్తానన్నారు. ఏ కార్యక్రమం నిర్వహించిన పార్టీలకు అతీతంగా నాయకులము సహకరిస్తామని ప్రతి ఒక్కరి సహకారంతో ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసుకుందామని తెలిపారు. ఈ జాతీయ కబడ్డి పోటీలకు సహకరించిన బిబిపేట మండలం జనగామ గ్రామానికి చెందిన తిమ్మయ్య గారి సుభాష్ రెడ్డి, తిమ్మయ్య గారి గోపాల్ రెడ్డి, సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డి, కిసాన్ షాపింగ్ మాల్ యజమాని ధన్పాల్ సూర్యనారాయణ, వీరితోపాటు ఈ పోటీలకు ఆర్థిక సాయం అందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఆటల్లో యువతరానికి పెద్దపీట వేసి భారతదేశాన్ని ప్రపంచంలోనే ఆటల్లో ప్రథమంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జాతీయ పోటీలు కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగుతుండడంతో క్రీడాకారులకు కావలసిన అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగిందని తెలిపారు. తెలంగాణకు వచ్చిన ఇతర రాష్ట్రాల క్రీడాకారులు దీనిని తీపి గుర్తులుగా ఉంచుకోవాలన్నారు. 28 రాష్ట్రాల క్రీడాకారులకు ఆతిథ్యం ఇవ్వడం సంతోషకరంగా ఉందన్నారు. కామారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి రాజు మాట్లాడుతూ.. మాట్లాడుతూ క్రీడల నిర్వహణ ఏర్పాట్లకోసం 15, 20 రోజుల నుండి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌తోపాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సైతం కృషి చేశారని అన్నారు. ఎస్‌జిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కుంభం రామిరెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటివరకు తెలంగాణలో మూడుసార్లు జాతీయ కబడ్డీ పోటీల నిర్వహించడం జరిగిందని, సూర్యాపేట, నల్గొండలో జరిగాయని, మూడవసారి కామారెడ్డిలో జరగడం అభినందనీయమన్నారు. కబడ్డీ ఆట అనేది ప్రపంచంలో ఏ దేశంలో లేదని, కేవలం భారతదేశంలోనే ఉందని, స్వతంత్ర పోరాట సమయంలో కబడ్డీ యోధులు జట్టులుగా ఏర్పడి స్వతంత్ర ఉద్యమంలో పాల్గొనడంతో ఆంగ్లేయులు ఈ ఆటని నిరోధించి నిలిపివేశారని చెప్పారు. స్వతంత్రం వచ్చిన తర్వాత భారతదేశంలో తిరిగి కబడ్డీని కొనసాగించడం జరిగిందన్నారు. ప్రారంభ కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు చేసిన నృత్యాలు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన అతిథులను అలరించాయి. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి రసూల్,ఆర్గనైజింగ్ సెక్రటరీలు దామోదర్ రెడ్డి,అనిల్ కుమార్, యాదయ్య, కుషాల్, రాజవర్ధన్, హది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పాల్గొన్న వివిధ రాష్ట్రాల క్రీడాకారులు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

బోథ్ రెవెన్యూ డివిజన్ అంశాన్ని పరిశీలించాలి

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుపై పరిశీలించాలని ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ ఆదివారం హైదరాబాద్‌లో రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ప్రగతి భవన్‌లోని మర్యాద పూర్వకంగా కలిసి సమస్యను విన్నవించారు. స్పందించిన మంత్రి త్వరలోనే రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై సీఎంతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లోకేశ్వరం

పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన లోకేశ్వరం మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుభీర్ మండలంలోని పల్సి గ్రామానికి చెందిన గణేష్(40) కూలీపనుల నిమిత్తం కుటుంబంతో సహా లోకేశ్వరం మండలం పొట్పెల్లి గ్రామంలో నివసిస్తున్నాడు. మద్యానికి బానిసై కొన్ని నెలలుగా ఖాళీగా తిరుగుతూ ఉన్నాడు. శనివారం మధ్యాహ్నం మద్యం మత్తులో పురుగులమందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని భైంసా ప్రాంతీయ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. అతని భార్య శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అంకోలిలో ప్రారంభమైన అంగడి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని అంకోలి గ్రామంలో ఆదివారం అంగడి నిర్వహించడం జరిగిందని సర్పంచ్ భూమన్న తెలిపారు. వారంలో ఒకరోజు నిర్వహించే సంతలు ఆదిలాబాద్ జిల్లాకు నేటికి కొనసాగుతున్నాయి. తాజాగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామంలో మొదటిసారిగా అంగడి (సంత) ఆదివారం ఘనంగా ప్రారంభమైందని అన్నారు. దీని కోసం గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏర్పట్లు చేయగా వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి ఈ సంతలో పాల్గొన్నారు. అటు ప్రతి ఆదివారం నిర్వహించే సంతలు ఇతర గ్రామాల వారు అంగడికి వచ్చి, సద్వినియోగం చేసుకోవాలని గ్రామ నాయకులు రమణ, గంగయ్య కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి : ఏబీవీపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ప్రయివేట్ పాఠశాల ప్రిన్సిపాల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని రిమాండ్‌కు తరలించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠాలు చెప్పాల్సిన ప్రిన్సిపాల్ ఇలాంటి వేధింపులకు గురి చేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహేశ్, నిఖిల్, ఉదయ్, శ్యామ్, అక్షయ్ పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడ్డ ప్రిన్సిపాల్ పై కేసు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓ విద్యార్థినిపై లైంగికంగా వేధింపులకు, గురి చేసిన ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసినట్టు మావల ఎస్సై వంగ విష్ణువర్ధన్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మావలలో ఉన్న ఓ ప్రయివేటు పాఠశాలలో పట్టణానికి చెందిన ఓ విద్యార్థిని పదో తరగతి చదువుకుంటుంది. అయితే ఆ పాఠశాలకు చెందిన ప్రిన్సిపాల్ మోహన్ రావ్ ఆమెను తరచు వేధింపులకు గురి చేశాడు. దీంతో విద్యార్థిని తమ తల్లిదండ్రులకు ఈ విషయం తెలుపడంతో ఆదివారం పాఠశాలకు వచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్ మోహన్‌రావ్‌పై విద్యార్థిని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఎస్బీ కానిస్టేబుల్‌కు సన్మానం

నవతెలంగాణ కడెం

ఎస్బీ కానిస్టేబుల్ మల్లేష్ యాదవ్ ఉత్తమ సేవలను అందించినందుకుగాను ఎస్పీ సీహెచ్ ప్రవీణ్ కుమార్ ప్రశంసించారు. దీంతో పాటు రివార్డును అందజేశారు. కాగా ఆదివారం కడెం మండల విలేకరులు ఎస్బీ కానిస్టేబుల్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. రాబోవు రోజుల్లో మరెన్నో పదోన్నతులు సాధించాలని ఆకాంక్షించారు. ఉత్తమ సేవలకు తప్పక గుర్తింపు లభిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేకరులు రవీందర్, ధన్‌రాజ్, రమేష్, దశిగౌడ్, రైతు అధ్యక్షులు రాజేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్

మండలానికి చెందిన హర్షిత, ఆరాధ్య ఛాలెంజ్ డాన్స్ అకాడమీలో శిక్షణ పొంది మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నగరంలో జరిగే డాన్స్ కాదంగల్ సీజన్ రెండులో సెలెక్ట్ కాగా అక్కడ వెళ్లడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి, విద్యార్థులకు రూ.30వేల తన వంతు ఆర్థిక సాయాన్ని అందజేశారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు.

తుడుం దెబ్బ డివిజన్ నూతన అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఉట్నూర్ డివిజన్ నూతన అధ్యక్షునిగా కనక ప్రభాకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో పెట్రోల్ బంక్ వద్ద సొరత్ లక్కు నాయక్ ఫిల్లింగ్ స్టేషన్ డీలర్ జాదవ్ మనోజ్ శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. సన్మాన కార్యక్రమంలో తిబొటె జ్ఞానోబా, ధుతరాజ్ విశ్వజిత్, ధుతరాజ్ మధుకర్, మడావి భీంరావ్ ఉన్నారు.

మహాలక్ష్మీ పథకాన్ని ప్రతి మహిళకు అందించాలి :ఐద్వా

సంక్రాంతి ముగ్గుల పోటీల్లో మహిళలు పాల్గొనాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు సుజాత

నవతెలంగాణ-కంఠేశ్వర్

మహాలక్ష్మీ పథకాన్ని ప్రతి మహిళకు అందించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, జిల్లా అధ్యక్షురాలు అనిత అన్నారు. నిజామాబాద్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని దీనికి పెద్ద ఎత్తున మహిళలు ముందుకు వచ్చే వారి నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరారు. ఈ ప్రభుత్వం ప్రకటించిన ఆరు పథకాలను అమలు జరపాలని అన్నారు. తెల్ల రేషన్ కార్డు చాలామంది నిరుపేదలకు లేదని, రేషన్ కార్డు త్వరగా నిరుపేదలకు అందించాలని తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని ప్రతి మహిళకు అందే విధంగా చూడాలని అన్నారు. నిరుపేదలు విద్య వైద్యానికి దూరమై ఇబ్బందులు పడుతున్నారని, వాటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి ప్రభుత్వం పెట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంజుల, లావణ్య, కల్పన, అనీషా. రజియ, శ్రీదేవి యశోద, తదితరులు పాల్గొన్నారు,

క్రికెట్ పోటీలు ప్రారంభించిన ఎస్సై

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలో సంక్రాంతి పండగ సందర్భంగా సిద్ధంవార్ దామాజి, సదానందం జ్ఞాపకార్థంగా మణికంఠ క్రికెట్ టీం ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందర మహాలక్ష్మి మందిర్ ప్రక్కన క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. ముందుగా కుభీర్ ఎస్సై ఎండీ షరీఫ్ స్థానిక సర్పంచ్ మీరా విజయ్ కుమార్ పూజలు చేసి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు చుట్టూ ప్రక్కల ఉన్న ఆయా గ్రామాలతో పాటు భైంసా ముధోల్, తానూర్, కుంటాలతో పాటు మహారాష్ట్ర నుంచి క్రికెట్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై పోటీలను ప్రారంభించారు. ఈపోటీల్లో 53 క్రికెట్ టీంలు పాల్గొన్నాయి. దీంతో ముందుగా రెండు జట్లను తీసుకొని వారికి పరిచయం చేసుకుని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువకులు ఈపోటీలో పాల్గొని, విజేతలుగా నిలవాలని అన్నారు. ఇందులో గెలుపొందిన టీమ్‌కు మొదటి బహుమతిగా రూ.21వేలు రెండో బహుమతిగా రూ.11వేల నగదు బహుమతిగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధంవార్ వివేకానంద, నగేష్, పుప్పాల పీరాజి, మల్లేష్, నాగేందర్, గ్రామస్తులు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

నవతెలంగాణ-ఇచ్చోడ

క్రీడలతోనే శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్లమ్మగూడ గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో పరిచయాలు చేసుకొని టాస్ వేసి క్రీడలు ప్రారంభించారు. ముందుగా ఒక ఓవర్ బ్యాటింగ్ చేసిన ఆయన రెండు ఫోర్స్ కొట్టి క్రీడాకారులను, ప్రేక్షకులను వినోదపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరిచి స్నేహపూర్వకంగా ఆడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు, ఉపసర్పంచ్ అజీమ్ పాల్గొన్నారు.

ఆయకట్టుకు అందని సదర్‌మాట్ నీరు

- రైతుల్లో ఆందోళన

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్, కడెం మండలాల ఆయకట్టు రైతులకు జీవనాధారమైన సదర్‌మాట్ ఆయకట్టుకు రబీ సాగు కోసం నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేతుల మీదుగా, నీటి పారుదల శాఖ అధికారులు సదర్‌మాట్ నీటిని విడుదల చేయించారు. కాని కెనాల్‌లో ఇంతవరకు పూర్తిస్థాయిలో నీరు ప్రవహించడం లేదు. ప్రధాన కాలువలో కేవలం రెండు అడుగుల మట్టంతోనే నీరు ప్రవహిస్తోంది. దీంతో తూములకు నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం నారు మడులను తడుపు కోవడానికి సరిపడా నీరు రావడం లేదని పలువురు వాపోతున్నారు. నీటి విడుదల రోజున సదర్‌మాట్ ఆనకట్టలో నిండుగా కనిపించిన నిల్వలను చూసి అధికారులు నీరు వదిలారు. వదిలిన నీరు చివరి ఆయకట్టు గలుమల వరకైనా చేర లేదు. దీంతో సదరు రైతులు వరి నార్లు పోసుకోవడంపై ఆందోళన చెందుతున్నారు. ఎగువ నుంచి గోదావరి నదిలో నీటి ప్రవాహం లేక పోవడంతో సదర్‌మాట్‌లో నీటి నిల్వలు తగ్గిపోయాయి. కెనాల్‌లో 4 అడుగుల మట్టంతో ప్రవాహం ఉంటేనే తూములన్నింటికి నీరు అందే అవకాశం ఉంటుంది. ఎస్సారెస్పీ అధికారులు దృష్టి సారించి, సదర్‌మాట్ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

సమయం దాటితే నష్టపోతాం...

సల్ల శ్రీనివాస్ ఖానాపూర్

రబీలో అధికారులు నీరు వదలడం సంతోషంగా ఉంది. కాని అన్ని గలుమలకు నీరు అందుత లేదు. పూర్తిస్థాయిలో వదిలితే నార్లు పోసుకుంటాము. సమయం దాటిపోతే నష్టపోతాం.

మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి

- ఎంపీ సోయం బాపురావు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వెనకబడిన ఆదిలాబాద్ జిల్లాలో మెరుగైన వైద్య సేవలను అందించడానికి కృషి చేస్తున్నామని, వసతులను తెలుసుకోవడానికి త్వరలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జిల్లాలో పర్యటించనున్నారని ఎంపీ సోయం బాపురావు సూచన ప్రయంగా తెలిపారు. ఎలాంటి అపరేషన్ లేకుండా రిమ్స్ సూపర్ స్పెషలిటిలో కిడ్నిలోని రాళ్లను ఎలాంటి ఆపరేషన్, నొప్పి లేకుండా వచ్చిన పరికారాన్ని ఆదివారం ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా రిమ్స్‌కు వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేలను రిమ్స్ అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ వెనకబడిన ఆదిలాబాద్‌లో అత్యధికంగా ఆదివాసులే ఉంటారని అన్నారు. వారికి నాణ్యమైన వైద్యం అందించమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అదే విధంగా జిల్లాలోని స్థితిగతులను తెలుసుకోవడానికి ఈ నెల చివరి వారంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఉంటుందని సూచన ప్రయంగా చెప్పారు. రిమ్స్‌లో అందే సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు ఎల్లవేళల అందుబాటులో ఉంటు వారికి సేవలు అందించాలని కోరారు.

రూ. 4 కోట్లతో ఆధునాతన పరికరం..

ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ రిమ్స్ నుంచి ఏ ఒక్క రోగి కూడా రేఫర్ కాకుండా ఇక్కడే వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రిమ్స్ వైద్యుల కొరత ఉన్నప్పటికి, ఉన్న వైద్యులపై బారం పడుతున్న సేవలు అందించడం అభినందనీయమన్నారు. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో లేని పరికరాలు ఇక్కడ ఉన్నాయన్నారు. ఎలాంటి అపరేషన్, నొప్పి లేకుండా కిడ్నిలోని రాళ్లను తొలగించడం జరుగుతుందన్నారు. దాదాపు రూ.4కోట్లతో ఆధునాతన పరికరం రిమ్స్‌కు వచ్చిందన్నారు. రోగులు ఇక్కడి సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, రేడియాలజిస్టు డాక్టర్ కళ్యాణ్‌రెడ్డి, వైద్యులు కార్తీక్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాజీనామ ఆలోచనలో కౌన్సిలర్లు

- రసవత్తరంగా మారనున్న మున్సిపల్ రాజకీయం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్ మున్సిపల్ రాజకీయం రసవత్తరంగా మారుతోంది. చైర్మెన్ ను వ్యతిరేఖిస్తూ అవిశ్వాస తీర్మాణం చేసిన మెజార్టీ కౌన్సిలర్లు రాజీనామాకు సిద్ధమైనట్టు సమాచారం. వీరంతా రేపో మాపో తమ నిర్ణయం వెల్లడించనున్నట్టు తెలుస్తోంది. ఆరునెలల క్రితం మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్‌పై బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు కలిసి అవిశ్వాస తీర్మాణ నోటీసును కలెక్టర్‌కు అందజేశారు. అప్పటి నుంచి మున్సిపాలిటీ పాలకవర్గంలో చైర్మెన్ వర్సెస్ కౌన్సిలర్లు అన్నట్లుగా ఆధిపత్యం సాగుతోంది. 12 మంది సభ్యులు ఉన్న చిన్న మున్సిపాలిటీలో మెజార్టీ సభ్యులను ఏకతాటిపై ఉంచడంలో చైర్మెన్ విఫలమైన కారణంగా అవిశ్వాసానికి తెరలేపినట్లైంది. ఇదే అలుసుగా పలువురు స్వయం ప్రకటిత వీడీసీ పెద్దలు తలదూర్చడం సమస్య మరింత జఠిలం కావడానికి కారణమైంది. ఈ క్రమంలో ఈ నెల 5న జరగాల్సిన అవిశ్వాస తీర్మాణ బల నిరూపన కోర్టు స్టేతో నిలిచి పోయింది. అధికారులు చేసిన తప్పుగా భావిస్తున్న సదరు కౌన్సిలర్లు తమ పదవులకు రాజీనామ చేసేందుకు ప్రణాళికను రూపొందించుకుంటున్నట్టు తెలుస్తోంది.

ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-బేల

మండలంలోని కొబ్బాయి గ్రామ పంచాయతీలోని ఉపాసనాల గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఐటీడీఏ నుంచి వారికి సీసీడీపీ గ్రాంటులో ఒక్కో లబ్ధిదారునికి రెండున్నర లక్షలు ద్వారా నిర్మించనున్న 10 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పాయల శంకర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిగితా అన్ని రాష్ట్రాలలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద లక్షల ఇండ్లు వచ్చినా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతతో ఒక్క ఇల్లు కూడా రాలేదని అన్నారు. కొత్తగా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా ఆలోచించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. పనులను నాణ్యతగా చేసి వీలైనంత త్వరగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డీఈ సురేష్, ఏఈ సుధాకర్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్ భోయర్, మండల అధ్యక్షులు దత్తానిక్కం, నాయకులు మోరేశ్వర్, రాకేష్, కృష్ణ, శివకుమార్, సంజయ్, రాము బర్కడే, సందీప్ రాక్రే, ప్రదీప్ ఖోడే పాల్గొన్నారు.